తెలంగాణ
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | బుధవారం-24- డిసెంబర్ 2025 | సంపుటి : 3 | సంచిక : 206 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

## సర్పంచ్‌లకు సిఎం రేవంత్ శుభాకాంక్షలు


**పంచాయితీలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని ఆకాంక్ష**




**హైదరాబాద్,డిసెంబర్23 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ తన సత్తా చాటింది. ఈ ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు..

మిగతా 2లో

## మాజీ ప్రధాని పివికి సిఎం రేవంత్ నివాళి



**హైదరాబాద్,డిసెంబర్23 (తెలంగాణ ముచ్చట్లు):** భారత మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నరసింహారావు వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘనంగా నివాళి అర్పించారు. జూబ్లీహిల్స్ నివాసంలో ఆ మహనీయుడి చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఆర్థిక సంస్కరణల దార్శనికుడు మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు అని సిఎం అన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో దేశాన్ని స్థిరత్వం వైపు నడిపిన అపూర్వ మేధావి, బహుభాషా పండితుడిగా, పరిపాలనలో ఆయన తీసుకున్న నిర్ణయాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయన్నారు. తెలంగాణ బిడ్డగా దేశ ప్రధానిగా ఎదిగి, ప్రపంచ పటంలో భారతదేశానికి గౌరవం పెంచిన మహనీయుడని ఆయన సేవలు మరువలేనివని కొనియాడారు.

# తెలంగాణకు స్పష్టమైన విజన్ తెలంగాణ రైజింగ్

- అన్ని శాఖలకు సంబంధించి పాలసీ
- క్యూర్, ప్యూర్, రేర్‌గా విభజించి అభివృద్ధికి ప్రణాళికలు
- ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట ఉద్యోగుల వివరాలు ఇవ్వండి
- అద్దె భవనాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు తరలించండి
- అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ సూచనలు



**హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):** ప్రజాప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయింది. ఈ రెండేళ్లలో కొన్ని విజయాలు సాధించాం. కొన్ని ప్రణాళికలు రూపొందించుకున్నాం అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. గతంలో ఎనర్జీ, ఎడ్యుకేషన్, ఇరిగేషన్, హెల్త్ లాంటి వివిధ శాఖలకు సంబంధించి ఒక పాలసీ లేకపోవడంతో కొన్ని సమస్యలు వచ్చాయన్నారు. అందుకే ముఖ్యమైన విభాగాలకు ఒక పాలసీని తీసుకున్నాం. రాష్ట్రానికి ఒక పాలసీ ఉండాలని తెలంగాణ రైజింగ్ `2047 విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేశామన్నారు. రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్‌గా విభజించి అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం. స్పష్టమైన విధి విధానాలతో మేము ముందుకు వెళ్తున్నాం' అని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్ని శాఖల ఉన్నతాధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు.

మిగతా 2లో



## కెసీఆర్ ధోరణి మార్చుకో

- తోలు వలుస్తామంటే ఎవ్వరూ భయపడరు
- అలాంటి వారికి ప్రజలే బుద్ధి చెబుతారు
- ఘాటుగా స్పందించిన డిప్యూటి సిఎం భట్టి

**ఖమ్మం,డిసెంబర్23(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాజకీయాల్లో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం ముదిరింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రంగా స్పందించారు. శాసనసభకు వచ్చే ధైర్యం లేని వారు, బయట ఉండి అడ్డగోలుగా మాట్లాడటం తగదని ఆయన హెచ్చరించారు. ప్రజా ప్రభుత్వంపై భారత రాష్ట్ర సమితి నేతలు విషం కక్కుతున్నారని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా తల్లాడ మండలం పినపాక గ్రామంలో నూతన సబ్ స్టేషన్ నిర్మాణానికి ఉపముఖ్యమంత్రి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి పైసా ప్రజల కోసమే ఖర్చు పెడుతున్నామని, ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం చేయట్లేదని వివరించారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ కోసం ఏడా రూ.12,500 కోట్లు విద్యుత్‌శాఖకు ప్రభుత్వం చెల్లిస్తోందని చెప్పారు. తోలు తీస్తామని బీఆర్ఎస్ నేతల మాదిరిగా దిగజారి మాట్లాడలేమన్నారు. అలాంటి వ్యాఖ్యలు చేసిన వారికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. రెండేళ్లుగా అసెంబ్లీకి రాని కేసీఆర్.. మీడియా సమావేశంలో ఇష్టారీతిన మాట్లాడుతున్నారని విమర్శించారు.

మిగతా 2లో



## ముగ్గురు ఏఎస్‌జీల నియామకం

- సుప్రీంకోర్టుకు ముగ్గురు ఏఎస్‌జీల నియామకం
- కేంద్ర ప్రభుత్వ అధికారిక ఉత్తర్వులు జారీ
- దవీందర్ పాల్ సింగ్‌కు కీలక బాధ్యత
- అనిల్ కౌశిక్, రవీంద్ర కనకమేడల ఎంపిక
- మూడేళ్ల కాలపరిమితితో పదవి
- కేంద్రం తరపున కేసుల వాదన బాధ్యత

**న్యూఢిల్లీ:, (తెలంగాణ ముచ్చట్లు)** సుప్రీంకోర్టుకు ముగ్గురు అడిషనల్ సొలిసిటర్ జనరల్‌ను నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. సీనియర్ న్యాయవాది దవీందర్ పాల్ సింగ్, అనిల్ కౌశిక్, రవీంద్ర కనకమేడలలను ఏఎస్‌జీలుగా నియమిస్తూ కేంద్రం

2లో

## కెసిఆర్ రాకతో సర్కార్‌లో వణుకు

- అర్థారాత్రి వరకు మీటింగ్‌లు..సమీక్షలు
- సిఎం రేవంత్‌కు సచివాలయ వాస్తు భయం
- అందుకే సచివాలయానికి రావడం లేదు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శలు



**హైదరాబాద్ , (తెలంగాణ ముచ్చట్లు):** కేసీఆర్ మీడియా ముందుకు వచ్చిన తర్వాత రేవంత్ సర్కార్ డిఫెన్స్ లో పడిరదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. తాను 25 ఏళ్ళుగా రాజకీయాల్లో ఉన్నానని, రాత్రి 9.30 గంటలకు ముఖ్యమంత్రి చిట్‌చాట్ పెట్టడం చూడలేదని చెప్పారు. మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడిన ఆయన.. అందాల పోటీలు, ఫుట్‌బాల్ షోకులు, గ్లోబల్ సమ్మిట్‌లు అన్నం పెడతాయా..? అని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌కు వాస్తు భయం పట్టుకుందని, అందుకే సచివాలయానికి పోవటం లేదని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాలుగు వేల మంది సర్పంచ్‌లుగా గెలిచారని, బీఆర్ఎస్ దెబ్బకు డీసీసీబీలకు ఎన్నికలు పెట్టడం లేదని, కాంగ్రెస్ కార్యకర్తలను నామినేట్ చేయాలని చూస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు. రేవంత్‌రెడ్డి పోలీసులు లేకుండా ఓయూకు వస్తానని చెప్పారని, కానీ పోలీస్ పహారా మధ్య వచ్చారని అన్నారు. ఇరిగేషన్‌పై పీపీటీని స్వాగతిస్తున్నామని,

మిగతా 2లో

# దమ్ముంటే సహకార ఎన్నికలు నిర్వహించండి

- నామినేటెడ్ పద్ధతిలో భర్తీకి సర్కార్ యత్నం
- ఓటు వేసే సమయమొస్తే రైతులు కర్రుకాల్చి వాతలకు సిద్ధం
- నల్లగొండలో సర్పంచ్‌ల తో సమావేశంలో బిఆర్ఎస్ నేత కేటీఆర్



**నల్లగొండ,డిసెంబర్23(తెలంగాణ ముచ్చట్లు):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన '420' హామీలను అమలు చేయలేక, ప్రజలకు ముఖం చూపించలేక సహకార ఎన్నికల నిర్వహణ నుంచి తప్పించుకుంటోందని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఓటమి భయంతోనే కాంగ్రెస్ సర్కారు నామినేటెడ్ పద్ధతిలో 'సహకార' పదవులు నింపుకుంటున్నారని ఎద్దేవా చేశారు. రైతులకు ఓటేసే అవకాశం ఇస్తే కాంగ్రెస్‌కు కర్రు కాల్చి వాత పెట్టడం ఖాయయని అన్నారు. జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికలను కూడా ప్రభుత్వం భయంతోనే వాయిదా వేస్తోందని విమర్శించారు. నల్లగొండ జిల్లాలో సర్పంచులు, వార్డు మెంబర్‌ల సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. కార్యకర్తలకు దిశానిర్దేశంచేస్తూ.. అర్జునుడు చిలుక కన్నును లక్ష్యంగా చేసుకున్నట్టు.. మన దృష్టి కూడా కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీల అమలుపైనే ఉండాలని కేటీఆర్ సూచించారు.

2లో

## యాదగిరిగుట్టలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఫ్లెక్సీ వార్

- యాదగిరిగుట్టలో కాంగ్రెస్–బీఆర్ఎస్ ఫ్లెక్సీ వార్
- వైకుంఠ ద్వారం వద్ద ఫ్లెక్సీల ఏర్పాటు పై వివాదం
- నిషేధం ఉన్నా ఫ్లెక్సీలు పెట్టారంటూ బీఆర్ఎస్ ఆగ్రహం
- ఫ్లెక్సీలు చించేసిన బీఆర్ఎస్ కార్యకర్తలు
- బైఠాయించిన బీఆర్ఎస్ నేతలు – రంగంలోకి పోలీసులు
- మంత్రుల పర్యటన పేరుతో ఓవరాక్షన్ ఆరోపణలు
- ఈవో, స్థానిక ఎమ్మెల్యేపై పక్షపాతం ఆరోపణలు



**యాదాద్రి భువనగిరి, (తెలంగాణ ముచ్చట్లు):** యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్టలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య ఫ్లెక్సీ వార్ నడిచింది. మంత్రులకు సంబంధించిన ఫ్లెక్సీలను కాంగ్రెస్ నేతలు వైకుంఠ ద్వారం దగ్గర ఏర్పాటు చేయడంపై బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు అభ్యంతరం వ్యక్తం చేశారు.

మిగతా 7లో




## యూరియా కోసం యాప్ ద్వారా బుకింగ్

- రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు
- గ్రామాల వారీగా సమావేశాల ద్వారా చైతన్యం

**నిజామాబాద్,డిసెంబర్23 (తెలంగాణ ముచ్చట్లు):** రైతులకు యూరియా ఎరువుల పంపిణీని మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎరువుల బుకింగ్ యాప్‌ను ప్రతి రైతు తప్పనిసరిగా వినియోగించాలని, వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయాధికారులకు కలెక్టర్ సూచించారు. దీంతో ఉమ్మడి జిల్లాలోని రైతులందరూ ఈ యాప్‌ను వినియోగించాలని, ఎలాంటి సందేహాలున్నా సమీపంలోని వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. ఎరువుల కోసం గంటల తరబడి లైన్లలో నిలబడకుండా.. సులభంగా, పారదర్శకంగా అవసరమైన ఎరువులు అందేలా ప్రభుత్వం ప్రత్యేకంగా యాప్ తీసుకొచ్చింది.

మిగతా 2లో



## ట్రిపుల్ ఆర్ రైతులతో రౌండ్ టేబుల్

**4న సమావేశం ఏర్పాటు: కవిత**

**యాదాద్రిభువనగిరి,డిసెంబర్23 (తెలంగాణ ముచ్చట్లు):** జనవరి 4న ఎనమిది జిల్లాల్లోని ట్రిపుల్ ఆర్ రైతులతో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్సీ, జాగృతి అధ్యక్షురాలు కవిత పేర్కొన్నారు. ట్రిపుల్ ఆర్ రైతులకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని అన్నారు. బీబీ నగర్ లోని ఎయిమ్స్‌ను ఆమె సందర్శించారు. అనతంరం కవిత మాట్లా డుతూ.. రైతులను జైలును పంపించడం సరైన పద్ధతి కాదని అన్నారు. ఆ ప్రభుత్వంలో నేను ఉన్నాను. నాకు తెలియదు కావున నేను రాయగిరి రైతులను క్షమాపణలు కోరుతున్నాను.

మిగతా 2లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# సర్పంచ్‌లకు సిఎం రేవంత్ శుభాకాంక్షలు

(మొదటి పేజీ తరువాయి)

మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారికి సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. మంచి పాలన అందించి, పంచాయతీలను ఆదర్శవంతమైన గ్రామాలుగా తీర్చిదిద్దుతారని.. మీరంతా ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతా వేదికగా పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన వారందరికీ సీఎం రేవంత్ శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీ ఎన్నికలు మూడు దశల్లో.. నవంబర్ 11, 14, 17 తేదీల్లో జరిగాయి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలను గెలుచుకుని అగ్రస్థానంలో నిలిచింది.



మూడు దశల్లో మొత్తం 6821 స్థానాల్లో గెలుపొందింది. ఇక ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ 3520 స్థానాలను కైవసం చేసుకుంది. బీజేపీ 703 స్థానాల్లో గెలిచింది. ఇతరులు 1654 స్థానాలను గెలుచుకున్నారు.

# తెలంగాణకు స్పష్టమైన విజన్ తెలంగాణ రైజింగ్



(మొదటి పేజీ తరువాయి)

ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఆయా శాఖల్లో పనులు, చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. శాఖల మధ్య సమన్వయంపై కీలక సూచనలు చేశారు. ప్రతీ సెక్రటరీ వారి వారి శాఖల్లో ఉన్న రెగ్యులర్, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు సంబంధించి పూర్తి వివరాలు జనవరి 26వ తేదీలోగా సీఎస్‌కు అందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు అందాల్సిన జీతాలు, ఈపీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం అందుతున్నాయో లేదో సంబంధిత శాఖల హెచ్‌వోడీలు వెరిఫై చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. ప్రక్రియను జనవరి 26వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో ఉండకూడదని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని స్పష్టం చేశారు. జనవరి 26వ తేదీలోపు అద్దె భవనాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలను వెంటనే ఖాళీ చేసి ప్రభుత్వ భవనాల్లోకి మారాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

# కెసిఆర్ ధోరణి మార్చుకో

(మొదటి పేజీ తరువాయి)

శాసనసభకు రావడానికి కేసీఆర్ భయపడుతున్నారన్నారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు ఇచ్చిన గొప్ప తీర్పు అని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాష్ట్రంలోని 85 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ భారీ ఆధిక్యతతో ఉంది. గతంలో ఏ రాజకీయ పార్టీని కూడా ప్రజలు ఇంత పెద్ద ఎత్తున దీవించలేదు. ఇందిరమ్మ రాజ్యం ప్రజల పక్షాన నిలబడటం వల్లే ప్రజలు స్వచ్ఛందంగా మాకు మద్దతు ఇస్తున్నారు అని ఆయన వివరించారు. ముఖ్యంగా 65 శాతం సర్పంచ్ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకోవడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. కేసీఆర్ చేసిన 'తోలు వలుస్తాం' అనే వ్యాఖ్యలను భట్టి తీవ్రంగా ఖండిరచారు. తోలు తీసుకునే ఉద్యోగం నువ్వు ఎప్పుడు తీసుకున్నావు కేసీఆర్? పదిమందిని



కూర్చోబెట్టుకొని తోలు వలుస్తానంటే ఇక్కడ ఎవరూ భయపడే వారు లేరు. నువ్వు అడ్డగోలుగా మాట్లాడినా, మేము మాత్రం దిగజారి ప్రవర్తించము. మా అభివృద్ధి చాటల ద్వారానే మీకు సమాధానం చెబుతాం' అని భట్టి వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష నాయకుడిగా శాసనసభకు వచ్చి ప్రజల సమస్యలపై మాట్లాడాల్సిన బాధ్యతను కేసీఆర్ విస్మరిస్తున్నారని ఆయన విమర్శించారు. సభకు వచ్చే ధైర్యం లేకనే బయట ఉండి ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారని మండిపడ్డారు.

గతంలో జరిగిన ఎన్నికలకు, ఇప్పుడు జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలకు చాలా తేడా ఉందని భట్టి విక్రమార్క అన్నారు. ఎటువంటి ఒత్తిడి లేకుండా, పూర్తి ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించామని, అందుకు ప్రజలు ఓటు ద్వారా కాంగ్రెస్ పార్టీకి అద్భుతమైన మద్దతు ఇచ్చారని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల

కంటే మెరుగైన ఫలితాలను ప్రజలు ఇచ్చారని, ఇప్పటికైనా కేసీఆర్ తన ధోరణి మార్చుకోవాలని ఆయన హితవు పలికారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సాగుతున్న ఇందిరమ్మ రాజ్యంలో ప్రజల తీర్పును గౌరవించాల్సింది పోయి, విమర్శలకే పరిమితం కావడం ప్రతిపక్షాలకు తగదని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు



# ముగ్గురు ఏఎస్‌జీల నియామకం

(మొదటి పేజీ తరువాయి)

అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. వీరు ముగ్గురు మూడేళ్ల పాటు ఈ బాధ్యతలో కొనసాగనున్నారు. దవీందర్ పాల్ సింగ్ గతంలో పంజాబ్, హర్యాణాకు అడిషనల్ అడ్వకేట్ జనరల్‌గా పనిచేశారు. అనిల్ కౌశిక్, కనకమేడల రవీంద్ర కుమార్ సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు. అడిషనల్ సొలిసటర్ జనరల్ కేంద్ర ప్రభుత్వం తరపున సుప్రీం కోర్టు, హైకోర్టులలో సివిల్, క్రిమినల్ కేసులు వాదిస్తారు. రాజ్యాంగం అంశాలతో పాటు ఇతర న్యాయ అంశాలలో ప్రభుత్వానికి వీరు సలహా ఇస్తారు. వీరు అటార్నీ జనరల్, సొలిసిటర్ జనరల్‌కు సహాయకారిగా ఉంటారు.

# కెసిఆర్ రాకతో సర్కార్‌లో వణుకు

(మొదటి పేజీ తరువాయి)

పీపీటీపై అసెంబ్లీలో తమకూ సరిపడా అవకాశం ఇవ్వాలని కోరారు. అసెంబ్లీలో తమ గొంతు నొక్కడం, మైక్ కట్ చేయడం లాంటివి చేయవద్దని అన్నారు. ఎవరి వాదన నిజమో ప్రజలు తేలుస్తారని చెప్పారు. సీపీఐ, ఎంఐఎం, బీజేపీ కంటే తక్కువ సమయం బీఆర్ఎస్‌కు ఇస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్‌కు ప్రభుత్వం భయపడుతుందని, అవకాశం ఇస్తే అసెంబ్లీలో కాంగ్రెస్ సర్కార్ బట్టలు విప్పుతామని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రభుత్వం దాచిపెట్టిన అన్ని జీవోలను నాలుగు వారాలలోపు బహిర్గతం చేయాలని, పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు సోకాల్డ్ ప్రజా ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. రేవంత్‌రెడ్డి తనది ప్రజా ప్రభుత్వం అని చెప్పుకోవడం కాదని, చీకటి జీవోల మాటున దొంగచాటుగా ఏం చేస్తున్నాడో బహిర్గతం చెయాలని ఆయన ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు. ప్రజాపాలన అని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ జీవోలు దాస్తూ డ్రామాలు చేస్తున్నదని హరీశ్‌రావు విమర్శించారు.



ఆర్టీఐ సమాధానం ఆధారంగా బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్ హైకోర్టులో వేసిన పబ్లిక్ ఇంట్రెస్ట్ లిటిగేషన్‌తో ఆ డ్రామాలు బయటపడబోతున్నాయని అన్నారు. 2023 డిసెంబర్ 7 నుంచి 2025 జనవరి 1 వరకు అంటే మొత్తం 13 నెలల్లో ప్రభుత్వం 19,064 జీవోలు జారీ చేసిందని, వాటిలో కేవలం 3,290 జీవోలు మాత్రమే పబ్లిక్ డొమైన్‌లో ఉంచడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. ఒక్క ఏడాదిలో 15,774 జీవోలు అంటే 82 శాతం జీవోలను దాచిపెట్టి ప్రభుత్వం ఏం చేస్తున్నట్లని హరీశ్‌రావు నిలదీశారు. 'రేవంత్ రెడ్డీ ఇదేనా మీరు చెప్పుకుంటున్న ప్రజా ప్రభుత్వం అని ప్రశ్నించారు.





# దమ్మ్ముంటే సహకార ఎన్నికలు నిర్వహించండి

(మొదటి పేజీ తరువాయి)

ఎన్ని కేసులు పెట్టినా, జైలుకు పంపినా భయపడేది లేదని, నల్లగొండ, మహబూబ్‌నగర్ రైతాంగానికి న్యాయం జరిగే వరకు మన పోరాటం ఆగవద్దని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా మంత్రులకు సాగునీటిపై కనీస అవగాహన లేదని, అబద్ధాలతో ప్రజలను మోసం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో కేసీఆర్ లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పే సత్తా ప్రభుత్వానికి లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. నల్లగొండ జిల్లాలో జరిగిన సర్పంచులు, వార్డ్ మెంబర్‌ల అభినందన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. పాలమూరు `రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం 90 శాతం పూర్తిచేస్తే.. మిగిలిన 10 శాతం పనులను కూడా ఈ ప్రభుత్వం పూర్తిచేయలేదని విమర్శించారు.

కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే కేసీఆర్ గర్జిస్తున్నారని, ఆయన గర్జనకు సమాధానం చెప్పలేక, ప్రజల దృష్టిని మళ్లించడానికి కేసుల పేరుతో నిరాధారమైన లీకులు ఇస్తున్నారని కేటీఆర్

మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు నిజంగానే మేలుచేసి ఉంటే సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించేదని, కానీ ఓటమి భయంతో ప్రభుత్వం వెనకడుగు వేస్తోందని విమర్శించారు. నామినేటెడ్ పద్ధతిపై ఆయన ధ్వజమెత్తారు. ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను చూసి భయంతో ప్రభుత్వం ఎన్నికలకు వెళ్లడంలేదని, నామినేటెడ్ పద్ధతిలో పదవులను భర్తీ చేస్తూ కాలక్షేపం చేస్తోందని కేటీఆర్ ఆరోపించారు. ఎన్నికలు పెడితే రైతులు తగిన బుద్ధి చెబుతారనే భయం ముఖ్యమంత్రిలో ఉందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయదారులు, కూలీలు ప్రభుత్వంపై తీవ్ర కోపంతో ఉన్నారని, ఆ ప్రభావం ఇప్పటికే సర్పంచ్ ఎన్నికల ఫలితాల్లో స్పష్టంగా కనిపిస్తోందని చెప్పారు. రైతుబంధు, కౌలు రైతులకు ఆర్థిక సాయం, రైతు కూలీలకు నెలకు వెయ్యి రూపాయల భరోసా వంటి హామీలను ప్రభుత్వం విస్మరించిందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే కేసీఆర్‌పై నిరాధారమైన కేసుల లీకులు ఇస్తున్నారని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి నిజాయితీ ఉంటే.. రైతులకు మంచి చేశామన్న నమ్మకం ఉంటే.. సహకార ఎన్నికలు పెట్టాలని సవాల్ విసిరారు. ఎన్నికల నుంచి కాంగ్రెస్ ఎన్ని రోజులు తప్పించుకున్నా, ప్రజాక్షేత్రంలో ఆ పార్టీని నిలదీయడం ఖాయమని కేటీఆర్ స్పష్టంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులపట్ల చిత్తశుద్ధితో ఉంటే వెంటనే సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ కేవలం కాలక్షేప రాజకీయాలు చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ముఖ్యమంత్రికి దమ్ముంటే, కేసుల గురించి వెనుక నుండి లీకులు ఇవ్వడం మానేసి, నేరుగా కెమెరా ముందుకు రావాలని, ఏ కేసు పెడుతున్నారో చెప్పాలని సవాల్ విసిరారు. హోంమంత్రి కూడా ఆయనే కాబట్టి ధైర్యంగా ముందుకు వచ్చి మాట్లాడాలని, శిఖండి రాజకీయాలు చేయడం తగదని విమర్శించారు. ప్రజా ప్రయోజనాలకంటే కేవలం కేసుల చుట్టూనే ప్రభుత్వాన్ని తిప్పుతున్నారని ఎద్దేవా చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి, ఎమ్మెల్సీ మంకెన కోటిరెడ్డితోపాటు మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్ కుమార్, భూపాల్ రెడ్డి, రవీంద్ర కుమార్ నాయక్, చిరుమర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు. వీరితోపాటు మాజీ ఎంపీ లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్సీ కర్నే ప్రభాకర్, నాయకులు చెరుకు సుధాకర్, ఒంటెద్దు నరసింహారెడ్డి, ఇతర ముఖ్య నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొని పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపారు.

# ట్రిపుల్ ఆర్ రైతులతో రౌండ్ టేబుల్

రాయగిరి రైతులు ఇప్పటికే చాలాసార్లు భూములు ఇచ్చి ఉన్నారు.

కావున అలైన్మెం ట్ మార్చాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాడుతా.. కేంద్రమంత్రి గడ్కరీని కలుద్దాం అని అన్నారు. పెద్దల భూములు కాపాడేందుకు చిన్న సన్నకారు రైతులకు అన్యాయం జరగకుండా చూడాలని, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని కోరారు. మరోవైపు ఎయిమ్స్‌లో ఎమర్జెన్సీ మెడిసిన్ దొరకే పరిస్థితి లేదన్నారు. అన్నారు. భవన నిర్మాణంలో కాంట్రాక్టర్ల అలసత్వం వహిస్తున్నారని తెలిపారు. జిల్లాలో ఎంపీలు, ఎమ్మెల్యేలు దృష్టి సారించి ఎయిమ్స్ కాంట్రాక్టర్లు ఒత్తిడి తెచ్చిన నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు.





# యూరియా కోసం యాప్ ద్వారా బుకింగ్

రైతులు ఇంటి దగ్గరే ఉండే ఆయా సీజన్లకు అవసరమైన ఎరువులను యాప్‌లో బుకింగ్ చేసుకొని సులభంగా పొందవచ్చు. జిల్లాలో ఇది అమల్లోకి రావడంతో ఎలా బుకింగ్ చేయాలి అన్న అంశాలపై రైతులకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. ఇందుకోసం వ్యవసాయ అధికారులు గ్రామాల్లో సమావేశాలు పెట్టి అవగాహన రైతులకు కల్పిస్తున్నారు. రైతు వేదికలు, పంచాయతీ భవనాలు, సొసైటీలు, గ్రామ కూడళ్లలో సమావేశాలు పెట్టి .. యాప్ గురించి సులభంగా అర్థమయ్యేలా వివరిస్తున్నారు. జిల్లాలో ప్రధానంగా వరి, మక్క, సోయా, పత్తి, చెరకు, కంది, పెసర, మినప పంటలు సాగు చేస్తుంటారు. ఈ పంటల సాగుకు విరివిగా ఎరువులు అవసరమవుతాయి. ప్రధానంగా యూరియా వినియోగంఎక్కువ.




డిమాండ్ ఎక్కువగా ఉండడంతో సొసైటీలు, డీలర్ల వద్ద రైతులు ఎరువుల కోసం క్యూ కట్టవలసివస్తోంది. ఖరీఫ్ సీజన్‌లో రైతులు గంటల తరబడి లైన్లలో నిల్చోవలసివచ్చింది. కొన్ని చోట్ల లైన్లలో చెప్పులు, రాళ్లు పెట్టి ఎదురుచూసినా కొందరికి యూరియా దొరకలేదన్న ప్రచారం జరిగింది. రైతులు ఒక్కసారిగా సొసైటీలు, షాపుల ధ్గరకు రావడం, కొరత రానుందన్న ప్రచారంతో అవసరానికి మించి యూరియి బస్తాలు కొని దాచుకోవాలని ఆశించడంతో పరిస్థితి గందరగోళంగా మారింది. దీంతో ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ఎరువుల బుకింగ్ యాప్ తీసుకొచ్చింది. దీని వల్ల రైతులకు అవసరాలకు తగినంత యూరియా అందనుంది. యూరియా పక్కదారి పట్టే అవకాశం కూడా ఉండదు. రైతులు తమ పట్టాదారు పాసుబుక్ నంబర్, భూమి వివరాలు, పంటల సాగు వివరాలు ఎంట్రీ చేసుకోవాలి. ఆ తర్వాత తమకు అవసరమైన యూరియా బుకింగ్ చేసుకోవచ్చు. భూ విస్తీర్ణం బట్టి రైతులకు యూరియా కేటాయింపు ఉంటుంది. బుక్ చేసుకున్న 24 గంటల్లోగా రైతులు ఎరువులను తీసుకోవాలి. గ్రామాల్లో వారం రోజుల పాటు అవేర్ నెస్ పోగ్రాంలు నిర్వహించనున్నట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.

# క్రైస్తవుల సంక్షేమానికి కట్టుబడి ఉంటా

## వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి





**వనపర్తి,డిసెంబర్23(తెలంగాణ ముచ్చట్లు):** క్రైస్తవుల సంక్షేమం,అభివృద్ధికి తాను ఎప్పుడూ కట్టుబడి ఉంటానని వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘారెడ్డి అన్నారు.మంగళ వారం వనపర్తి పట్టణంలోని దాచా లక్ష్మయ్య ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం క్రైస్తవుల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తోందని, అందులో భాగంగానే క్రిస్మస్ వేడుకల నిర్వహణకు రూ.2 లక్షలు కేటాయించిందని తెలిపారు. అలాగే క్షేత్రస్థాయిలోని చర్చిలకు రూ.30 వేల చొప్పున మంజూరు చేసిందని పేర్కొన్నారు. సంబంధిత నిబంధనలను పాటిస్తూ ఆయా నిధులను బ్యాంకు ఖాతాల్లో జమ చేసుకొని వినియోగించుకోవాలని నిర్వాహకులకు సూచించారు.వనపర్తి నియోజకవర్గ పరిధి లోని చర్చిల అభివృద్ధికి తాను పూర్తిస్థాయిలో సహకారం అందిస్తానని, చర్చిలకు అవసరమైన పనుల వివరాలతో నివేదికలు సిద్ధం చేసి అందజేయాలని నిర్వాహకులను కోరారు. అలాగే రెండు ఎకరాల విస్తీర్ణంలో క్రైస్తవ సంఘ భవనం నిర్మాణం, గ్రేవ్‌యార్డ్ ఏర్పాటుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని చర్యలు చేపడతానని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, జిల్లా అధికారి అఫ్జలుద్దీన్, ఉప కలెక్టర్ శ్రావ్య, వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, క్రైస్తవ సంఘ నాయకులు బెంజిమెన్, జానప్ప జాన్, రాజు, గోర్లు అనిల్, గంధం బాలరాజు, వేణు, శ్రీకాంత్, తిమోతి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో ఘనంగా ప్రీ క్రిస్మస్ వేడుకలు





హన్మకొండ,డిసెంబర్23(తెలంగాణ ముచ్చట్లు): క్రిస్మస్ పండగను పురస్కరించుకొని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో ప్రీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ మేన శ్రీను,డిటిఓ శ్రీనివాస్ కుమార్ పాల్గొని సిబ్బందికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కుల మతాలకు అతీతంగా ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే పండుగ క్రిస్మస్ అని, మానవత్వం, ప్రేమ, సౌభ్రాతృత్వం వంటి విలువలను ఈ పండుగ గుర్తుచేస్తుందని వారు పేర్కొన్నారు. క్రిస్మస్ యొక్క ప్రాముఖ్యతను సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీఆర్‌డీఓ ఈజీఎస్ సెర్ప్, సూపరింటెండెంట్లు, డీపీఎంలు, ఏపీఎంలు తదితర అధికారులు,కార్యాలయ సిబ్బంది పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# పెండింగ్‌లో ఉన్న లెప్రసీ డబ్బులు విడుదల చేయాలి

## పెద్దమందడిలో ఆశ కార్యకర్తల ధర్నా



**పెద్దమందడి,డిసెంబర్23(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలంలోని ఆశ కార్యకర్తలకు సంబంధించిన 2025 కుష్టు డబ్బులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ ఆసుపత్రి ముందు ఆశ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు.అనంతరం డాక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కోశాధికారి బొబ్బిలి నిక్సన్ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న కుష్టు డబ్బులను వెంటనే విడుదల చేయాలని, డిసెంబర్‌లో నిర్వహించే కుష్టు సర్వేకు అదనంగా డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు ఆశ కార్యకర్తలకు నెలకు రూ.18,000 ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని, పల్స్ పోలియో, గ్రామ పంచాయతీ ఎన్నికల డ్యూటీలకు సంబంధించిన డబ్బులను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఫిక్స్‌డ్ వేతనంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించి, కేంద్రం పెంచిన పారితోషకాలను రాష్ట్ర ప్రభుత్వం యథావిధిగా అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.గతంలో ఇచ్చిన హామీ ప్రకారం ఆశ కార్యకర్తలకు రూ.50 లక్షల ఇన్సూరెన్స్ అమలు చేస్తూ వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని, ప్రతి ఆదివారం, పండుగలకు సెలవులు ప్రకటించాలని కోరారు. అలాగే డిసెంబర్ 10న ఇచ్చిన హామీ ప్రకారం ఏఎన్‌సీపీ, ఎన్‌సీ తదితర టార్గెట్లను రద్దు చేస్తూ వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు.ఆశ కార్యకర్తలకు రూ.5 లక్షల రిటైర్మెంట్ డబ్బులు ఇవ్వాలని, ప్రస్తుతం ఇస్తున్న పారితోషికంలో సగాన్ని పెన్షన్‌గా నిర్ణయించి అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు డి. గిరిజ, ఉపాధ్యక్షురాలు బాల మన్నెమ్మ, కార్యదర్శి భారతి, సహాయ కార్యదర్శి కాజమ్మ, కోశాధికారి పోషమ్మ, ఎం. రాధా, నారాయణమ్మ, సి. రాధా, సరస్వతి, ఉమాదేవి, మమత, వి. రాధ, సుగుణమ్మ, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.






# నైపుణ్యాభివృద్ధితోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు

◆ **ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వీణ జోషి**

**పెద్దమందడి,డిసెంబర్23(తెలంగాణ ముచ్చట్లు):** విద్యార్థులు తమ తమ రంగాల్లో నైపుణ్యాభివృద్ధి చేసుకుంటేనే వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని మోజర్ల ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వీణ జోషి అన్నారు. శ్రీ కొండ లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం 11వ సంస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రోజురోజుకు తగ్గిపోతున్న సహజ వనరులు, పెరుగుతున్న జనాభా నేపథ్యంలో నేల, నీరు, పంటల సాగులో నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యత ఎంతో అవసరమని తెలిపారు.ఉద్యోగాల కల్పన పూర్తిగా విద్యార్థుల నైపుణ్యాలపైనే ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు.వర్టికల్ ఫార్మింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డ్రోన్ టెక్నాలజీ, మైక్రో ఇరిగేషన్ వంటి ఆధునిక రంగాల్లో మానవ వనరుల అవసరం అధికంగా ఉందని తెలిపారు.పెట్టుబడి ఖర్చులు తగ్గించే సాంకేతికతలు, నూతన వంగడాలు రైతులకు ఎంతో మేలు చేస్తాయని, ఆ దిశగా శాస్త్రవేత్తలు నిరంతరం పరిశోధనలు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారి రావుల విద్యాసాగర్ మాట్లాడుతూ, పామాయిల్ సాగుతో సంవత్సరం పొడవునా ఉపాధి లభించడంతో పాటు రైతుల ఆదాయ వనరులు పెరుగుతాయని అన్నారు.అలాగే సూక్ష్మసేద్యాన్ని రైతులు అవలంబిస్తే నీటి వినియోగ సామర్థ్యం మరింత పెరుగుతుందని వివరించారు.కార్యక్రమంలో భాగంగా శ్రీ కొండ లక్ష్మణ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఆయన సేవలను స్మరించుకున్నారు.విశ్వవిద్యాలయం సాధించిన విజయాలపై రూపొందించిన వీడియోను ప్రదర్శించారు.వివిధ మోడళ్లపై బీ.ఎస్.సీ. హార్టికల్చర్ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఓఎస్ఏ డాక్టర్ శంకర స్వామి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కళాధర్ బాబు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ షహనాజ్, డాక్టర్ మాధవి, నవ్వే శ్వేతతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# నాడు భర్త.. నేడు భార్య కరుణాపురం 1వ వార్డు మెంబర్‌గా రాజారపు రమా ప్రమాణస్వీకారం



**ధర్మసాగర్,డిసెంబర్23(తెలంగాణ ముచ్చట్లు):** ధర్మసాగర్ మండలంలోని కరుణాపురం గ్రామంలో 1వ వార్డు మెంబర్‌గా రాజారపు రమా సోమవారం అధికారికంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రత్యేక చర్చకు దారితీసిన అంశం ఏమిటంటే, ఇదే వార్డుకు గతంలో రాజారపు రమా భర్త రాజారపు సుమన్ వార్డు మెంబర్‌గా పనిచేసి ప్రజలకు సేవలు అందించడమే. నాడు భర్త ప్రజాప్రతినిధిగా పని చేయగా, నేడు భార్య అదే బాధ్యతను స్వీకరించడం గ్రామంలో రాజకీయ పరంపరగా నిలిచింది.

ప్రమాణస్వీకార అనంతరం రాజారపు రమా మాట్లాడుతూ, తమపై ప్రజలు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తానని అన్నారు. గతంలో తన భర్త వార్డు అభివృద్ధి కోసం చేసిన సేవలు తనకు ప్రేరణగా నిలిచాయని, అదే బాటలో నడుచుకుంటూ ప్రజల సమస్యలను ప్రాధాన్యంగా తీసుకుని పరిష్కారానికి ప్రయత్నిస్తానని తెలిపారు. వార్డులో మౌలిక సదుపాయాల మెరుగుదల, పరిశుభ్రత, తాగునీరు, వీధి దీపాలు, డ్రైనేజీ వంటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని చెప్పారు.

ప్రజలు ఎప్పుడైనా తనను సంప్రదించేలా అందుబాటులో ఉంటానని, వార్డు అభివృద్ధే లక్ష్యంగా పారదర్శకంగా పని చేస్తానని రాజారపు రమా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, వార్డు ప్రజలు పాల్గొని ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతంను కలిసిన దయ్యాల దాసు



**వనపర్తి,డిసెంబర్23(తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్ర కార్మిక విభాగ ఆర్గనైజింగ్ సెక్రటరీ దయ్యాల దాసు ఆధ్వర్యంలో మంగళవారం దళిత నాయకులు ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతం ను మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ను శాలువాతో సన్మానించారు. అనంతరం రాజీవ్ యువ వికాసం పథకం కింద దరఖాస్తులు చేసిన రుణాలకు తక్షణమే నిధులు విడుదల చేయాలని దయ్యాల దాసు కోరారు. దీనిపై స్పందించిన చైర్మన్ నగరి ప్రీతం ఇదివరకే రూ.2,000 కోట్ల నిధులు విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఖచ్చితంగా రుణాలు అందించే బాధ్యతను ఎస్సీ కార్పొరేషన్ తీసుకుంటుందని హామీ ఇచ్చారు.రాజీవ్ యువ వికాసం పథకంతో పాటు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కూడా లోన్లు మంజూరు చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని ఆయన వెల్లడించారని దయ్యాల దాసు తెలిపారు..ఈ కార్యక్రమంలో గద్దల ప్రభాకర్, నిరంజన్, కృష్ణ, దయ్యాల అంజన్న, గుండెల చంద్ర మోహన్, శంకర్, రవి తదితరులు పాల్గొన్నారు.

# రైతులను సన్మానించిన బ్యాంక్ అధికారులు




**హసన్ పర్తి, డిసెంబర్ 23(తెలంగాణ ముచ్చట్లు):** రైతు దినోత్సవాన్ని పురస్కరించుకొని హసన్ పర్తి మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పరిధిలోని రైతులను బ్యాంక్ మేనేజర్ సకులాల్ లకావత్ కార్తీక్ సన్మానించారు.ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ దేశానికి అన్నం పెడుతున్నరైతులకు అభివందనమని పేర్కొన్నారు. ప్రతి రైతు దేశానికి గర్వకారణమని ,రైతులు ఉత్పత్తి దారులనుండి నుండి వ్యవస్థాపకులుగా మారాలని కోరారు. బ్యాంక్ అందిస్తున్న కిసాన్ సమృద్ధి పథకం,దీర్ఘ,స్వల్పకాలిక పంట రుణాలు గురించి రైతులకు వివరించారు. సకాలంలో రుణాలను చెల్లించినట్లయితే కలిగే ప్రయోజనాలను,రుణం తీసుకొని మరణించిన రైతుల రుణ విముక్తి విధానాలను వివరించారు.

బ్యాంకుల అందిస్తున్న వివిధ రుణ సదుపాయాలను పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు పరిధిలోని ఎనిమిది గ్రామాల నుండి 50 మంది రైతులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# సింగరేణి నూతన జీఎం కార్యాలయ భవనాన్ని ప్రారంభించిన డిప్యూటీ సీఎం: భట్టి

- మారుతున్న కాలానికి అనుగుణంగా సింగరేణి రూపాంతరం.
- ప్రపంచంతో పోటీ పడే సంస్థగా తీర్చిదిద్దుతాం.
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**సత్తుపల్లి, డిసెంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు):** స్థానిక పట్టణంలో నిర్మించిన సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ నూతన జీఎం కార్యాలయ భవనాన్ని సింగరేణి సీఎండీ కృష్ణ భాస్కర్, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌లతో కలిసి డిప్యూటీ సీఎం ప్రారంభించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, 137వ సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను కార్మికుల మధ్య జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. విశాలంగా నిర్మించిన నూతన జీఎం కార్యాలయాన్ని ప్రారంభించుకోవడం గర్వకారణమని చెప్పారు. ప్రస్తుతం సింగరేణి సంస్థలో 45 వేల మంది శాశ్వత ఉద్యోగులు, 40 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరా చేస్తూ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్న సంస్థగా సింగరేణి నిలుస్తోందన్నారు.

సింగరేణి మరిన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి పెంచే దిశగా ప్రభుత్వం విధానాలు రూపొందిస్తోందని తెలిపారు. రేర్ ఎర్త్ మినరల్స్, క్రిటికల్ మినరల్స్ మైనింగ్ వైపు కూడా సింగరేణి దృష్టి సారించాలని సూచించారు. గ్లోబల్ స్థాయిలో సింగరేణి జెండా ఎగరాలని ఆకాంక్షించారు.

గ్రీన్ ఎనర్జీ రంగంలో భాగంగా ప్రయోగాత్మకంగా ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో పంప్డ్ స్టోరేజ్ ప్లాంట్ నిర్మాణానికి చర్యలు చేపడతామని, రాజస్థాన్ ప్రభుత్వంతో 1500 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తికి ఎంఓయూ కుదిరిందన్నారు. సింగరేణి పరిధిలోని బొగ్గు బ్లాకులు ఇతరుల చేతికి వెళ్లకుండా కట్టుదిట్టమైన ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు.

తెలంగాణ విద్యుత్ కేంద్రాలకు అవసరమైన బొగ్గుతో పాటు ఇతర రాష్ట్రాలకు కూడా బొగ్గు సరఫరా చేస్తూ సింగరేణి కాలరీస్ కంపెనీ కీలక పాత్ర పోషిస్తున్నదని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. విద్యుత్ ఉత్పత్తితో పాటు వ్యాపార అవసరాలకూ సింగరేణి బొగ్గు ప్రాధాన్యం పెరిగిందని పేర్కొన్నారు.

గతంలో ప్రభుత్వ రంగానికే పరిమితమైన బొగ్గు ఉత్పత్తి రంగంలో, కాలక్రమేణా వచ్చిన మార్పులతో ప్రైవేటు సంస్థలకు కూడా కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. బొగ్గు గనుల ఆక్షన్లలో ప్రైవేటు సంస్థలు పాల్గొనడంతో పాటు, విదేశాల నుంచి బొగ్గు దిగుమతులకు కూడా అవకాశం ఉండటంతో పోటీ పెరిగిందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో సింగరేణి నిలదొక్కుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

నాణ్యమైన బొగ్గును మార్కెట్ ధరకు సరఫరా చేస్తూ, పోటీని తట్టుకునేలా ఉత్పత్తి సామర్థ్యం, నాణ్యతను పెంచుకోవాలని సూచించారు. మైనింగ్ రంగంలో సింగరేణికి ఉన్న అనుభవం మరే సంస్థకూ లేదని పేర్కొన్న డిప్యూటీ సీఎం, బొగ్గు తవ్వకాలకే పరిమితం కాకుండా ప్రపంచ స్థాయిలో పోటీ పడే సంస్థగా సింగరేణిని తీర్చిదిద్దుతున్నామని స్పష్టం చేశారు.

సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి మాట్లాడుతూ, సింగరేణి సంస్థ సీఎస్ఆర్ నిధుల కింద సత్తుపల్లి ప్రాంతంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందన్నారు. సింగరేణి ప్రభావిత ప్రాంతాలైన కిష్టారం, వెంగళరావు నగర్, ఎన్టీఆర్ కాలనీల్లో కాలుష్య సమస్యలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇళ్లు కోల్పోయిన 40 కుటుంబాలకు నూతన ఇళ్లను నిర్మించామని, మరో 200 ఇళ్ల నిర్మాణం అవసరమని పేర్కొన్నారు. కిష్టారం గ్రామ ప్రజలకు ఆర్ఆర్ ప్యాకేజీ అందించి పునరావాసం కల్పించాలని కోరారు. అంతకు ముందు సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని డిప్యూటీ సీఎం కేక్ కట్ చేశారు. అనంతరం జీవీఆర్ ఓపెన్ కాస్ట్ గనిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ విక్రమ్ సింగ్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, విద్యుత్ శాఖ ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి, సింగరేణి అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.





# ఫాధర్ కొలంబో(సిబిఎస్ఈ) పాఠశాలలో ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు

**స్టేషన్ ఘనపూర్, డిసెంబర్23(తెలంగాణ ముచ్చట్లు):** మండల కేంద్రంలోని ఫాదర్ కొలంబో( సిబిఎస్ఈ) పాఠశాలలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు క్రీస్తు జయంతి నేపథ్యాన్ని కళ్లకు కట్టినట్టుగా ప్రదర్శిస్తూ ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ప్రభు జన్మకు సంబంధించిన సంఘటనలను నాటక రూపంలో చూపించి సందర్శకులను ఆకట్టుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఫాదర్



చిన్నయ్య మాట్లాడుతూ, క్రీస్తు జయంతి లోకానికి ఒక మహత్తర పర్వదినమని తెలిపారు. ప్రభు జన్మ ద్వారా ప్రేమ, శాంతి, సమాధానం అనే విలువలు సమాజానికి అందాయని, వాటిని ప్రతి ఒక్కరూ తమ జీవనంలో ఆచరించి పొరుగు వారితో పంచుకోవాల్సిన అవసరం ఉందని సందేశం ఇచ్చారు.క్రిస్మస్ సందేశాన్ని ప్రతిబింబించేలా నిర్వహించిన ఈ వేడుకలు పాఠశాల ప్రాంగణంలో ఉత్సాహభరిత వాతావరణాన్ని నెలకొల్పాయి.ఈ వేడుకల్లో ఫాదర్ కొలంబో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఫాదర్ థామస్ కిరణ్‌తో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రాంగ్ ప్లేస్!

మీరు మీరు
పొట్లాట!
దేనికోసం?

పేదలు
పేదరికంమీద
పోట్లాడాలి!

అమాయకత్వం!
అజ్ఞానం!పేదరికం!

ఇవి మిమ్మల్ని
ఈ స్థితికి
దిగజార్చాయి!

జోగి జోగి తన్నుకుంటే
రాలేది బూడిద!

మీ దరిద్రానికి
కారణం మీద
పోట్లాడండి!

తిండి గుడ్డ
నీడ పని ఇవికావాలి!

ఇవ్వాల్సిన
బాధ్యత
ప్రభుత్వానిది!

వాళ్ళతో
పోట్లాడి
సాధించండి!

వాళ్ళుమీకు
దేవుణ్ణి చూపిస్తారు!

యాత్రలు చేయిస్తారు
కొండలెక్కిస్తారు!

ముడుపులు
కట్టించి
హుండీల్లో
వేయిస్తారు!

వేలయేండ్లుగా
చేస్తున్నారు!
దరిద్రం పోయిందా?

ఎంతమాత్రం
దరిద్రం
పోనేపోదు!

ఇంకా మిమ్మల్ని
దేవుడికోసం
తిప్పుతారు!

ప్రభాత గీతాలు!
నగరసంకీర్తనలు!
దేవుణ్ణి లేపాలి!

అసలే
దరిద్రం
కాలేకడుపులు
ఇంకా మీతో..!

ఉపవాసాలు!
జాగారాలు!
చేయిస్తారు!

అవి పరిష్కారాలు
కానేకావు!
ఉద్యమించండి!

అందరూ
కలిసి
ప్రభుత్వాలను
నిలదీయండి!

దేవుణ్ణి
గుండెల్లో
ఉంచుకోండి!

గుండెలు
పగిలేటట్టు
అరవండి!

మీ అరుపులు
హిమాలయాల్లోకాదు
అసెంబ్లీల్లో
వినపడాలి!

మూగ చెవిటి
ప్రభుత్వాలు
దిగిరావాలి!

పోట్లాడాల్సింది
అక్కడకాని
మీరుమీరు కాదు!

కులాలు కాదు!
మతాలు కాదు!
మందిరాలు కాదు!

ప్రభుత్వాలను
గట్టిగాపిలవండి
వాళ్లతో
పోట్లాడండి!

భజనలైనా
భక్తిగీతాలైనా
అసెంబ్లీల
ముందు!

అవసరమైతే
పార్లమెంట్ ముందు
కూర్చోండి!

దేవుడు
ఎక్కడున్నాడు!
ప్లేస్ మార్చాడు!

తెలుసుకోండి
గుడిలో లేడు!
అది 'రాంగ్ ప్లేస్'!

మసీదు చర్చి
ఇక్కడా లేడు!
అవికూడా'రాంగ్ ప్లేస్'!

- తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

# ధర్మసాగర్ మండలంలో గణిత టాలెంట్ టెస్ట్ నిర్వహణ




- ఉత్తమ ప్రతిభ కనబర్చిన తాటికాయల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని జాహ్నవి

**ధర్మసాగర్,డిసెంబర్23(తెలంగాణ ముచ్చట్లు):** గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ పుట్టినరోజును పురస్కరించుకొని ధర్మసాగర్ మండలంలోని బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయి గణిత టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలల నుంచి పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పోటీలో పాల్గొన్నారు. గణితంపై ఆసక్తి పెంపొందించడం, ప్రతిభావంతులను గుర్తించడం లక్ష్యంగా ఈ పరీక్షను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి డాక్టర్ బి. రామ్ ధన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గణిత ఫోరం మండల అధ్యక్షుడు బండ రమేష్, జిల్లా కమిటీ సభ్యుడు పింగిలి సత్యనారాయణ రెడ్డి, వివిధ పాఠశాలల గణిత ఉపాధ్యాయులు, బాలుర ఉన్నత పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు కవిత తదితరులు హాజరయ్యారు. టాలెంట్ టెస్ట్ ఫలితాల్లో తాటికాయల ఉన్నత పాఠశాలకు చెందిన జాహ్నవి ప్రథమ స్థానం సాధించగా, ధర్మసాగర్ గర్ల్స్ హైస్కూల్‌కు చెందిన అక్షిత ద్వితీయ స్థానం, పెద్ద పెండ్యాల పాఠశాల విద్యార్థి అర్బన్ కుమార్ తృతీయ స్థానం పొందారు. రెసిడెన్షియల్ విభాగంలో కస్తూర్బా పాఠశాల విద్యార్థిని కృష్ణవేణి ప్రథమ స్థానం సాధించగా, టీవీఎస్‌డబ్ల్యూ ఆర్ ఎస్ విభాగంలో లక్ష్మీ ప్రసన్న వర్షిని మరియు జెస్సిలు విజేతలుగా నిలిచారు.ఈ పోటీ ద్వారా విద్యార్థుల్లో గణితంపై ఆసక్తి మరింత పెరుగుతుందని ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు.

# ధన మూర్తి ప్రథమ వర్ధంతి పురస్కరించుకొని అనాథ పిల్లలకు అన్నదాన కార్యక్రమం



**ఖమ్మం బ్యూరో,డిసెంబర్ 23(తెలంగాణ ముచ్చట్లు):** నేలకొండపల్లి వంట మాస్టరు చట్టు ధన మూర్తి ప్రథమ వర్ధంతి పురస్కరించుకొని ఖమ్మం గాయత్రి మానసిక దివ్యాంగుల కేంద్రంలో పిల్లలకు భార్యచట్టు పుష్పావతి కూతుళ్లు రేగళ్ల కుమారి రజిని అన్నపూర్ణ అల్లుళ్ళు ధనమూర్తి సైదులు వీరబాబు అనాధ పిల్లలకు అన్నదానం ఏర్పాటు చేయనున్నది దానిలో పనిచేసే ట్రస్ట్ చైర్మన్ మరియు యాజమాన్యం వారికి కృతజ్ఞతలు తెలియజేశారు

# ధూపదీప నైవేద్య అర్చక సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ఆత్మీయ సమ్మేళనం

**ఎల్కతుర్తి, డిసెంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు):** ఎల్కతుర్తి మండలం వల్లభాపురం గ్రామంలోని శ్రీ పశుపతి నాథ్ దేవస్థానం ఆలయ అర్చకులు, ధూపదీప నైవేద్య అర్చక సంఘం హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి, ఎల్కతుర్తి మండల అధ్యక్షులు శ్రీ సదానిరంజన్ సిద్ధాంతి మాట్లాడుతూ ధూపదీప నైవేద్య అర్చక సంఘం ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఆత్మీయ సమ్మేళనం డిసెంబర్ 24, 2025 బుధవారం నాడు హనుమకొండ జిల్లాలోని తిరుమల తిరుపతి దేవస్థాన కళ్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఆత్మీయ సమ్మేళనాన్ని ధూపదీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీ దౌలతాబాద్ వాసుదేవ శర్మ ఆదేశాల మేరకు, హనుమకొండ జిల్లా



అధ్యక్షులు శ్రీ గణేష్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని ప్రతి ధూపదీప నైవేద్య అర్చకుడు తప్పనిసరిగా ఈ సమ్మేళనానికి హాజరై, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎల్కతుర్తి మండల అధ్యక్షులు శ్రీ సదానిరంజన్ సిద్ధాంతి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని ధూపదీప నైవేద్య అర్చకులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**హసన్ పర్తి,డిసెంబర్ 23 (తెలంగాణ ముచ్చట్లు):** వరంగల్ పోలీస్ కమిషనరేట్ హసన్ పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని దేవన్నపేట గ్రామానికి చెందిన యువకుడు మంగళవారం రోజున మృతి చెందినట్లు హసన్ పర్తి సిఐ చేరాలు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హసన్ పర్తి మండలం మండలం దేవన్నపేట గ్రామానికి చెందిన పంజాల భూపాల్ చిన్న కుమారుడు అయిన పంజాల చరిత్ కుమార్ (27) మంగళవారం ఉదయం 10 గంటల 45 నిమిషాలకు టీఎస్ 03 ఎఫ్ యు 9125 నంబరు గల హోండా యాక్టివా ద్విచక్ర వాహనంపై దేవన్నపేట గ్రామం నుండి నిరూప్ నగర్ తండా కి బయలుదేరగా ఉనికిచెర్ల వైపు వెళుతున్న టీజీ 25 0799 నెంబరు గల టిప్పర్ డ్రైవరు అతి



వేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ రోడ్డు డివైడర్ పై నుండి దూసుకెళ్లి నిరూప్ నగర్ తండా వద్ద చరిత్ కుమార్ నడుపుతున్న ద్వి చక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో చరిత్ కుమార్ అక్కడికక్కడే మరణించినట్లు హసన్ పర్తి సీఐ చేరాలు తెలియజేశారు. మృతుడి తండ్రి పంజాల భూపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

# మేటి గాయకుడు రఫీ



ప్రముఖ ఉత్తర భారత నేపథ్యగాయకుడు. హిందీ సినీ చిత్ర సీమలో ఒకనాడు మకుటం లేని మహారాజుగా వెలిగాడు. హిందీ సినిమా రంగం 1950 నుండి 1970 కాలం మహమ్మద్ రఫీ యుగం అంటే అతిశయోక్తి గాదు. కేవలం రఫీ పాటలతో వందల కొద్దీ చిత్రాలు విజయం పొందాయనేది నూటికి నూరుపాళ్లు నిజం. తన గాన మాధుర్యంతో ప్రేక్షకులను అలరించిన మహ్మద్ రఫీ 24 డిసెంబర్ 1924 పంజాబ్ లోని అమృత్ సర్ లో జన్మించాడు. బాల్యంలో తమ గ్రామానికి వచ్చే ఫకీర్ల గానాన్ని రఫీ అనుకరించే వాడు. అలా చిన్నప్పడే సంగీతంతో మక్కువ ఏర్పడింది. ఆ క్రమంలోనే ఉస్తాద్ బడే గులామ్ అలీ ఖాన్ వద్ద రఫీ సంగీత శిక్షణలో రాటుదేలాడు. అలా సినిమాల్లో పాటలు పాడడానికి 1944లో బొంబాయి వెళ్లాడు. గావ్ కీ గోరి' అనే హిందీ చిత్రంలో జి.ఎం.దురానీ తో కలిసి రఫీకి మొదటిసారి పాడే అవకాశం వచ్చింది. రఫీ పాడిన తొలి హిందీ గీతమిది. ఆ తర్వాత 1948లో గాంధీజీ హత్య జరిగినపుడు రఫీ 'సునో సునో ఏ దునియావాలో బాపూజీకి అమర్ కహానీ' పాటతో పాపులర్ అయ్యాడు. ఈ పాటకు భారత ప్రధాని నెహ్రూ చేతుల మీదుగా సిల్వర్ మెడల్ అందుకున్నాడు. హిందీ సినిమా గాన జగత్తులో 1950 నుండి 1970 కాలం మహమ్మద్ రఫీ యుగం అంటే అతిశయోక్తి గాదు. రఫీ హిందీ, ఉర్దూ, మరాఠీ, తెలుగు భాషలలో పాటలు పాడాడు. 17 భాషలలో తన గానంతో అందరినీ అబ్బుర పరచాడు, లతా మంగేష్కర్ ల గాయక జోడీ, హిందీ నేపథ్యగాన చరిత్రలో కొత్త ఒరవడిని, రికార్డును సృష్టించింది. మహ్మద్ రఫీని వరించిన అవార్డులకు లెక్కేలేదు. కేంద్ర ప్రభుత్వంచే పద్మశ్రీ పురస్కారం. జాతీయ స్థాయిలో ఉత్తమ గాయకుడిగా అవార్డుతో పాటు పలు ఫిల్మ్ ఫేర్ అవార్డులు ఆయన్ని వరించాయి. హిందీతో పాటు 17 భారతీయ భాషల్లో 20వేలకు పైగా పాటలు పాడాడు. తొలితరం భారతీయ సినీ సంగీత సాగర ప్రయాణానికి దిక్సూచి లాంటి వాడు రఫీ. పృథ్వీరాజ్ కపూర్, రాజ్ కపూర్, రిషీ కపూర్ వంటి మూడు తరాల బాలీవుడ్ నటులకు స్వరాలు అందించిన ఘనత రఫీ సొంతం. తెలుగు విషయానికొస్తే...తండ్రి ఎన్టీఆర్, కొడుకు బాలకృష్ణకు ప్లేబ్యాక్ అందించారు రఫీ. నౌషాద్ కోసం రఫీ మొత్తం 149 పాటలు, బర్మన్‌తో కలిసి 37 చిత్రాలలో పని చేశాడు, శంకర్ జైకిషన్ కోసం రఫీ మొత్తం 341 సంఖ్యలను (216 సోలో) పాడారు. కల్యాంజీ ఆనంద్జీ రఫీ స్వరంలో సుమారు 170 పాటలు కంపోజ్ చేశారు. రవితో , మదన్ మోహన్‌తో , ఓ పీ నయ్యర్‌తో, లక్ష్మీకాంత్ ప్యారేలాల్‌తో, రోషన్, జైదేవ్, ఖయ్యామ్, రాజేష్ రోషన్, రవీంద్ర జైన్, బాపి లాహిరి, సపన్ జగ్మోహన్ వంటి సంగీత దర్శకులందరికీ తరచూ పాడారు. ఉషా ఖన్నా , సోనిక్ ఒమి , చిత్రగుప్తా , ఎస్ఎన్ త్రిపాఠి , ఎన్. దత్తా మరియు ఆర్.డి బర్మన్ లాంటి సంగీత దర్శకులతో పని చేశాడు. అనేక ప్రైవేట్ ఆల్బమ్‌లను వివిధ శైలులు మరియు భాషలలో రికార్డ్ చేశాడు. గిన్నీస్ రికార్డు ప్రకారం భారతీయ భాషలలో 28,000 పాటలను రికార్డ్ చేసినట్లు పేర్కొన్నారు. రఫీ రెండు సినిమాల్లో నటించాడు. లైలా మజ్ను (1945) చిత్రంలో ''తేరా జల్వా జిస్ నే దేఖా'' మరియు జుగ్ను (1947) చిత్రంలో ''వో అప్ని యాద్ దిలాన్ కో'' పాటల కోసం తెరపై కనిపించాడు.1948 స్వతంత్ర భారత మొదటి సాంవత్సరిక ఉత్సవాలలో రజత పతాకాన్ని జవహర్లాల్ నెహ్రూ చేతుల ద్వారా ప్రదానం చేయబడింది. 1967 భారత ప్రభుత్వంచే పద్మశ్రీ బిరుదు ప్రదానం చేయబడింది. 2001 హీరో హోండా, స్టార్ డస్ట్ మేగజైన్ లద్వారా ''బెస్ట్ సింగర్ ఆఫ్ ద మిలీనియం గౌరవ ప్రదానం. 2013 సి ఎన్ ఎన్.. ఐ బి ఎన్ పోల్ లో గ్రేటెస్ట్ వాయిస్ ఇన్ హిందీ సినిమాగా ఎన్నికయ్యాడు.''చౌధవీఁ కా చాంద్ హో , తేరి ''ప్యారీ ప్యారీ సూరత్ కో'', ''చాహూంగా మై తుఝే సాంఝ్ సవేరే'', ''బహారో ఫూల్ బర్సావో'', ''మై గావూ తుమ్ సోజావో'', ''ఖిలోనా జాన్ కర్'', ''క్యా హువా తేరా వాదా'', ఇలా ఒక్కటేమిటి, రఫీ పాడిన ఎన్నో పాటలు చిరస్థాయిగా నిలిచిపోయే జ్ఞాపకాలుగా మిగిలి పోయాయి. తెలుగులో ఆయన పాడిన ప్రతి పాట ఆణిముత్యమే. 'భలే తమ్ముడు' చిత్రం లోని ఎంతవారు కానీ వేదాంతులైనా కానీ, ఎన్టీఆర్ 'ఆరాధన'లో నా మది నిన్ను పిలిచింది గానమై.. 'అక్బర్ సలీం అనార్కలి'లో ఆయన పాడిన సిపాయి పాట నేటీకి తెలుగు ప్రేక్షకుల్లో మనసుల్లో అలాగే నిలిచి వుంది. 1980 జూలై 31న శాశ్వత నిద్రలోకి జారుకున్నారు. ఆయన ఈ లోకాన్ని వదిలి వెళ్లి దాదాపు 40 ఏళ్లు దాటినా ఆయన స్వరం ప్రతిగుండెలో ప్రతిధ్వనిస్తూనే ఉంది. అందుకే భారతీయ సినీ సంగీత ప్రపంచంలో రఫీ అమర గాయకుడిగా నిలిచిపోయారు.

# మద్రాస్ హైకోర్టు చారిత్రాత్మక తీర్పు: న్యాయ పీఠంపై 'హదీసు' నైతిక పరిమళం

ముహమ్మద్ ముజాహిద్



**ఖమ్మం బ్యూరో, డిసెంబర్ 23(తెలంగాణ ముచ్చట్లు):** భారత ప్రజాస్వామ్య సౌధానికి రాజ్యాంగం మూలస్తంభమైతే, నైతిక విలువలు ఆ సౌధానికి ప్రాణవాయువు వంటివి. మతం, కులం, ప్రాంతాలకు అతీతంగా మానవత్వాన్ని ప్రబోధించే సూక్తులు సమాజ హితానికి దిక్సూచీలు. అయితే, నేటి భారతీయ పరిపాలనా వాతావరణంలో ఈ నైతిక విలువల అమలు తీరును పరిశీలిస్తే ఒక విచిత్రమైన, ఆందోళనకరమైన వైరుధ్యం కనిపిస్తోంది.

న్యాయపీఠంపై 'హదీసు' గౌరవం

ఇటీవల మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ వెలువరించిన తీర్పు న్యాయశాస్త్ర చరిత్రలో ఒక మైలురాయిగా నిలుస్తుంది. మున్సిపల్ కార్పొరేషన్ తన మాజీ న్యాయవాదికి చెల్లించాల్సిన బకాయిల విషయంలో స్పందిస్తూ.. "పని చేసే వ్యక్తి చెమట చుక్కలు ఆరేలోపే అతని వేతనం చెల్లించాలి" అన్న ప్రవక్త ముహమ్మద్ (స) హదీస్‌ను న్యాయమూర్తి ఉదహరించారు.

ఇది కేవలం ఒక మతపరమైన ఉల్లేఖన కాదు; శ్రమ విలువను గుర్తించే ఒక సార్వత్రిక నైతిక సూత్రం. న్యాయస్థానం ఈ హదీసును గౌరవంగా స్వీకరించిందంటే, నైతికతకు మతపరమైన ముద్ర వేయకూడదని, అది న్యాయసమ్మతతకు ప్రాతిపదిక కావాలని కోర్టు భావించింది. ఆధునిక కార్మిక చట్టాలకు, మానవ హక్కులకు ఈ హదీసు వంటి ప్రాచీన సూత్రాలు ఏ విధంగా బలాన్నిస్తాయో ఈ తీర్పు చాటిచెప్పింది.

పరిపాలనలో 'నేరం'గా నైతికత!

న్యాయస్థానం ఒక హదీసు లోని నైతిక వాక్యాన్ని చట్టబద్ధమైన హక్కుగా గుర్తించిన తరుణంలోనే, ఉత్తరప్రదేశ్‌లోని కన్నౌజ్ జిల్లాలో దానికి పూర్తి విరుద్ధమైన సంఘటన చోటుచేసుకుంది. మహిళల రక్షణ, సామాజిక బాధ్యతపై అవగాహన కల్పిస్తూ అదే హదీసు వాక్యాన్ని ప్రస్తావించినందుకు ట్రాఫిక్ సబ్ ఇన్‌స్పెక్టర్ అఫాక్ ఖాన్‌ను శిక్షించడం దేనికి సంకేతం?

బాలికల భద్రత కోసం హితవు పలకడం నేరమా? లేక ఆ హితవులో ఉపయోగించిన హదీసు గ్రంథం నేరమా? ప్రభుత్వ కార్యాలయాల్లో భగవద్గీత శ్లోకాలను లేదా వివేకానందుడి బోధనలను ఉదహరించినప్పుడు కలిగని అభ్యంతరం, ఒక ముస్లిం అధికారి ప్రవక్త సూక్తులను (హదీసులను) ప్రస్తావించినప్పుడు మాత్రమే 'మత ప్రచారం'గా మారుతుందంటే, అది పరిపాలనా యంత్రాంగం పాటిస్తున్న ద్వంద్వ ప్రమాణమే అవుతుంది.

వైరుధ్యాల మధ్య ప్రజాస్వామ్యం

ఈ రెండు ఉదంతాలను బేరీజు వేస్తే ఒక అశనిపాతం లాంటి సత్యం బోధపడుతుంది: హదీసు లోని నైతికత న్యాయస్థానంలో ప్రశంసలు పొందుతోంది, కానీ క్షేత్రస్థాయిలో శిక్షలకు గురవుతోంది. అధికారి తన విధి నిర్వహణలో భాగంగా సామాజిక స్పృహ కల్పించే క్రమంలో నైతిక విలువలను ఉదహరించడం వ్యవస్థకు బలాన్నివ్వాలి కానీ, అతని మనోధైర్యాన్ని దెబ్బతీయకూడదు.

ముగింపు: మార్పు ఎక్కడ మొదలవ్వాలి?

న్యాయం అనేది అందరికీ ఒకేలా ఉండాలి. మద్రాస్ హైకోర్టు హదీసుల ప్రాముఖ్యతను ఏ విధంగా అయితే ఉన్నత పీఠంపై కూర్చోబెట్టిందో, పరిపాలనా యంత్రాంగం కూడా అదే స్ఫూర్తిని ప్రదర్శించాలి. నైతిక విలువలను కేవలం పుస్తకాలకే పరిమితం చేయకుండా, అధికారుల విధి నిర్వహణలోనూ వాటిని గౌరవించినప్పుడే ప్రజాస్వామ్య వ్యవస్థలో పారదర్శకత సాధ్యమవుతుంది.

# సవాలు విసురుతున్న యురేనియం

భూగర్భజలాల్లో, బాలింతల పాలల్లో యురేనియం స్థాయిలు ఇటీవలి పరిశోధనల్లో బయటపడడం శాస్త్రవేత్తల నుంచి వైద్య నిపుణుల వరకు ఆందోళన కలిగిస్తోంది. దీని రేడియో ధార్మిక ప్రభావం కన్నా దాని రసాయన విషప్రభావమే ప్రజల ఆరోగ్యానికి ముప్పు కలిగిస్తుందని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో యురేనియం స్థాయిలను తగ్గించడం ప్రభుత్వవర్గాలకు ఒక సవాలుగా మారింది. సహజంగా లభించే యురేనియం ఇటీవల దేశంలోని వేర్వేరు ప్రాంతాల్లో రెండు సార్లు బయటపడింది. దేశరాజధాని ఢిల్లీలో భూగర్భ జలాల్లో యురేనియం స్థాయిలు ఎక్కువగా ఉన్నాయని సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు (సిజిడబ్ల్యుబి) అధ్యయనంలో తేలింది. బీహార్‌లో ఎఐఐఎంఎస్ పరిశోధకులు, మహావీర్ క్యాన్సర్ సంస్థాన్ తల్లుల స్తన్యపాలల్లో కూడా యురేనియం అత్యధికంగా ఉన్నట్టు కనుగొన్నారు. ఈ రెండు అధ్యయనాలు ఈ యురేనియం స్థాయిలు పెరిగిపోతుండడాన్ని తీవ్రంగా పరిగణించి అత్యవసర చర్యలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నాయి. ఢిల్లీలో సేకరించిన 83 భూగర్భజలాల నమూనాల్లో 24 నమూనాలు బిఐఎస్ స్థాయిలకు మించి యురేనియం ఉందని సిజిడబ్లుబి వెల్లడించింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం లీటరు నీటిలో 30 మైక్రోగ్రాముల వరకు యురేనియం పరిమితి ఫరవాలేదు. సహజ యురేనియం వాయువ్య భారతం లోని రాళ్లల్లో ఉంటుంది. హైడ్రాలాజికల్ పరిస్థితుల్లో రాళ్లలోంచి కరిగికరిగి నీటివనరుల్లో చివరకు భూగర్భ జలాల్లో కలుస్తుంది. పారిశ్రామిక వ్యర్థాలు, రసాయన ఎరువుల వాడకం వంటి కారణాల వల్ల యురేనియం ఆహార గొలుసులోకి చేరుకునే అవకాశం ఉంది. దీని కచ్చితమైన మూలాన్ని తెలుసుకోవడానికి జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా పరిశోధనలు చేస్తోంది. నైట్రేట్, ఫ్లోరైడ్, స్లైనిటీ, భారీ లోహాలు కూడా అనేక ప్రాంతాల్లో ఎక్కువస్థాయిల్లో కనిపించాయి. దీనిని బట్టి నీటివనరులపై ఈ లోహ మూలకాల ప్రభావం పెరిగిందని బయటపడింది. బీహార్‌లోని ఆరు జిల్లాలకు చెందిన దాదాపు 40మంది బాలింతల తల్లిపాల నమూనాల్లో యురేనియం ఉన్నట్టు పరిశోధనల్లో తేలింది. అన్ని నమూనాల్లో యురేనియం (యు238) ఉన్నట్టు ఎయిమ్స్ ఢిల్లీకి చెందిన డాక్టర్ అశోక్‌వర్మ వెల్లడించారు. దీని గాఢత 0 నుంచి 5.25 మైక్రోగ్రాములు, లీటరు మధ్య నమోదైంది. దాదాపు 70% శిశువుల్లో యురేనియం ప్రభావం వల్ల అనేక అనారోగ్య సమస్యలువచ్చే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తల అంచనా.అయితే బాలింతల పాలల్లో యురేనియం స్థాయిలు తక్కువగా ఉన్నప్పటికీ వాటిని తాగే శిశువులు దీర్ఘకాలంలో క్యాన్సరేతర సమస్యలను ఎదుర్కొనే అవకాశం ఉందని, దీనివల్ల తల్లుల ఆరోగ్యం పైనా ప్రభావం పడే అవకాశం ఉన్నట్టు గుర్తించామని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అయితే బీహార్ బాలింతల పాలలో గుర్తించిన యురేనియం స్థాయిలు సురక్షితమైన పరిమితుల్లోనే ఉన్నాయని అంటున్నారు. వాస్తవానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ అనుమతించిన పరిమితి కంటే తాగునీటి లోనే దాదాపు ఆరు రెట్లు ఎక్కువగా యూరేనియం స్థాయిలు ఉన్నాయని బయటపడింది. ముఖ్యంగా బీహార్‌లోని ఖగారియా జిల్లాలో యురేనియం సగటు స్థాయి అత్యధికంగా ఉండగా, కటిహార్‌లో ఒకే నమూనాలో అత్యధిక గాఢత నమోదైంది. అయితే తల్లి పాలలో యురేనియం స్వల్ప మోతాదులో ఉన్నప్పటికీ శిశువులకు ఎలాంటి ప్రమాదం ఉండదని మరికొందరు పరిశోధకులు అంటున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్లుహెచ్ఒ) తాగు నీటిలో యురేనియం కోసం నిర్దేశించిన పరిమితి 30 మైక్రోగ్రాములు/ లీటరు. తల్లిపాల నమూనాల్లో లభించిన స్థాయి (గరిష్టంగా 5.25 మైక్రోగ్రాములు/ లీటరు) ఈ డబ్లుహెచ్ఒ ప్రమాణం కంటే చాలా తక్కువగా ఉంది. శాస్త్రవేత్తల అధ్యయనం ప్రకారం తల్లి శరీరంలోకి చేరిన యురేనియంలో ఎక్కువ భాగం మూత్రం ద్వారానే బయటకు వెళ్లిపోతుంది. తల్లిపాలలోకి చేరే యురేనియం శాతం చాలా తక్కువగా ఉంటుందని తెలుస్తోంది. భూగర్భజలాల్లో యురేనియం ఉన్నట్టయితే రేడియో ధార్మిక లక్షణాల కన్నా రసాయన కాలుష్యం ఎక్కువగా పెరుగుతుందని చెబుతున్నారు. మూత్రపిండాలు దెబ్బతినే ప్రమాదం ఏర్పడుతుంది. యురేనియం గనుల్లో పనిచేసే వారికి, యురేనియం ప్రాసెసింగ్ ప్లాంట్లలో పనిచేసే వారికి మూత్రపిండాలు దెబ్బతినే సమస్య ఏర్పడుతుంది. యురేనియం తక్కువ స్థాయిలో ఉన్న నీటిని తాగిన వారికి రేడియేషన్ కన్నా, రసాయన విష ప్రభావం తీవ్రంగా ఉంటుంది. ఢిల్లీలోని భూగర్భజలాల్లో రేడియో ధార్మికత బలహీనంగా కనిపించినా, మూత్రపిండాల కణాలపై దాని విష తీవప్రభావమే దేశంలో తీరని సమస్యగా ఉంటోంది. యూరప్ లోని కొన్ని ప్రాంతాల్లో పర్యావరణ పరంగా ప్రేరేపితమైన మూత్రపిండాల వ్యాధులు ఎక్కువగా నమోదవుతున్నాయి. ముఖ్యంగా గాలి కాలుష్యం, కొన్ని రసాయనాలకు గురికావడం మూత్రపిండాల వ్యాధులకు దోహదం చేస్తున్నట్టు పరిశోధనలు సూచిస్తున్నాయి. ఆహారం, తాగునీటిద్వారా యురేనియం లోపలికి ప్రవేశించడం సర్వసాధారణమే అయినప్పటికీ దుమ్ముధూళి పీల్చడం ద్వారా లేదా గాయపడిన చర్మం ద్వారా కూడా యురేనియం శరీరంలోకి ప్రవేశిస్తుంది. లోపలికి వెళ్లిన తరువాత ప్రధానంగా మూత్రపిండాలపైనే యురేనియం ప్రభావం మొదట కనిపిస్తుంది. ప్రధానంగా మూత్ర నాళికలను పాడు చేస్తుంది. దాంతో అవి పనిచేయకుండా పోతాయి. యురేనియం అత్యధిక స్థాయిల్లో ఉంటే క్రమేణా కాలేయం, ఊపిరితిత్తులు, నాడీవ్యవస్థలకు హాని కలిగిస్తుంది. జ్ఞాపకశక్తి తగ్గిపోతుంది. ఊపిరితిత్తుల్లో వాపు కనిపిస్తుంది. బరువు తక్కువ శిశువులు జన్మించడం లేదా నెలలు నిండకముందే ప్రసవించడం వంటి సంతానోత్పత్తి సమస్యలు ఎదురవుతాయి.

# ఐటి ఉద్యోగులకు ఎఐ ఎసరు

ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాది ఉద్యోగాలను ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఊడ్చేస్తోంది. ఒకప్పుడు తిరుగులేని ఉద్యోగ రంగంగా ఉన్న ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) రంగంలో కొలువు. ఈ రోజుల్లో గాల్లో దీపంలా మారింది. గతంలో ఓ ఉద్యోగిని తొలగించారంటే ఎన్నో కారణాలు ఉండేవి. ఈ ఏడాది ఎఐ కారణంగా ప్రపంచవ్యాప్తంగా దాదాపు లక్షన్నర ఉద్యోగాలు పోయినట్లు అంతర్జాతీయ గణాంకాలు చెబుతుండగా, వీటిలో నూటికి 90 టెక్ ఉద్యోగాలే కావటం గమనార్హం. ఇలా ఉద్యోగాలు పీకేసిన సంస్థల్లో టిసిఎస్, ఇన్ఫోసిస్, విప్రో, టెక్ మహీంద్రా వంటి కంపెనీలుండటం గమనార్హం. వీటిలో ఒక్క టిసిఎస్ సుమారు 20 వేల ఉద్యోగులను ఇంటికి పంపింది. గతంలో ఎవరి ఉద్యోగమైనా పోతే.. అనేక కారణాలుండేవి. కానీ, ప్రస్తుతం ఏ టెక్ సంస్థ అయినా లేఆఫ్ ప్రకటించిందంటే దానికి ఎఐ ప్రభావమే కారణమవుతోంది. ఈ నేపథ్యంలో టెక్ రంగంలోని ఉద్యోగులు తీవ్రమైన మానసిక ఒత్తిళ్ల మధ్య పనిచేయాల్సి వస్తోంది. ఏ రోజుకారోజు దినదిన గండం.. నూరేళ్ల ఆయుష్షుఅన్నట్లుగా వారు భయభయంగా ఉద్యోగాలు చేస్తున్నారు. రాబోయే ఐదేండ్లలో తమ ఉద్యోగులను పెద్దమొత్తంలో తొలగించనున్నట్టు 41% కంపెనీలు పేర్కొన్నట్టు వరల్డ్ ఎకానమిక్ ఫోరమ్ (డబ్ల్యుఇఎఫ్) ఇటీవల ఒక నివేదికలో వెల్లడించింది. ప్రధాన రంగాల్లోకి ఎఐ ప్రవేశించడమే దీనికి కారణంగా వివరించింది. అమెజాన్ ఎఐలో భారీ పెట్టుబడులు పెడుతోంది. 2025 నాటికి ఎఐ మెషిన్ లెర్నింగ్‌లో సుమారు ఎనిమిదిన్నర లక్షల కోట్లు ఖర్చు చేయడానికి కంపెనీ సిద్ధంగా ఉందని ప్రకటించింది. ఈ పెట్టుబడులతో, సంస్థలోని హైపెయిడ్ వైట్ కాలర్ ఉద్యోగులను ఎఐద్వారా భర్తీ చేయాలని అమెజాన్ లక్ష్యంగా పెట్టుకుంది. ఇది ఇప్పుడు విస్తృత చర్చకు దారితీస్తోంది. అమెజాన్ లేఆఫ్‌ల ప్రత్యక్ష ప్రభావం భారత దేశంపై పెద్దగా ఉండకపోవచ్చు. కానీ ఇతర బహుళజాతి కంపెనీలు ఎలాంటి చర్యలు తీసుకుంటాయనేది ప్రశ్నార్థకంగా మారింది. బెంగళూరు, చెన్నై, పుణె, హైదరాబాద్‌లోని అవుట్ సోర్సింగ్ హబ్‌లు ఇప్పటికే ఎఐ నుండి తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. చాలా వరకు ఐటి కంపెనీలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై ఉద్యోగులకు శిక్షణ కూడా ఇస్తున్నాయి. రానున్న రోజుల్లో దీనిని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకునేందుకు ఇప్పటి నుంచే సన్నద్ధం అవుతున్నాయి. ఈ సంవత్సరంలో ఇప్పటి వరకు మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్, క్రౌడ్ స్ట్రైక్, ఐబిఎం వంటి పెద్ద కంపెనీలు సుమారు 70,000 మంది ఉద్యోగులను తొలగించారు. మైక్రోసాఫ్ట్ లాభదాయకతను పెంచుకోవడం, ఎఐ, డేటా సెంటర్లలో భారీ పెట్టుబడుల కోసం ఉద్యోగులను తొలగిస్తోంది. ఐబిఎం హెచ్ఆర్ కార్యకలాపాలలో ఎఐ వ్యవస్థలను విస్తృతంగా ప్రవేశపెట్టి 8 వేల మంది ఉద్యోగులను తగ్గించింది. అమెరికా టెక్ దిగ్గజాలు భారత దేశంలో పెద్ద సంఖ్యలో ఉద్యోగులను కలిగి ఉన్నాయి. సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, సేల్స్, సపోర్ట్ వంటి విభాగాల్లో భారతీయ నిపుణులు కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న ఈ లేఆఫ్‌లు భారతీయ ఉద్యోగులపై ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రభావం చూపుతాయి. ఐటి రంగంలో ఇప్పుడు ఆటోమేషన్, ఎఐ టెక్నాలజీలు హల్‌చల్ చేస్తున్నాయి. ఈ టెక్నాలజీల పుణ్యమా అని పునరావృత పనుల్లో ఉద్యోగుల అవసరం లేకుండాపోతోంది. మిగతా పనుల్లోనూ ఐటి కంపెనీలు ఎఐని విరివిగా ఉపయోగిస్తున్నాయి. అందుకోసం ఉన్న ఉద్యోగులకే కొత్త డిజిటల్ టెక్నాలజీల్లో శిక్షణ ఇచ్చి వినియోగించుకుంటున్నాయి. ఆ టెక్నాలజీలపై పట్టు సాధించలేని ఉద్యోగులను ఇంటికి పంపిస్తున్నాయి. ఐటి ఉద్యోగులకు ఎఐ ఒక పెద్ద సవాలుగా మారింది. పొదుపు చర్యలు, పెరుగుతున్న నైపుణ్య అవసరాలు, ఆటోమేషన్, ఎఐ అడాప్టేషన్ ఒత్తిళ్లతో ఉద్యోగ ప్రపంచం తలకిందులవుతోంది. ఉద్యోగం ఉంటుందా, ఊడుతుందా అనే టెన్షన్‌తో టెకీలు ఆందోళన చెందుతున్నారు. ఇఎంఐలు ఎలా కట్టాలి? మరో ఉద్యోగం ఎప్పుడు వస్తుంది అనే ప్రశ్నలు వారిని వెంటాడుతున్నాయి. కంపెనీలు వ్యయం తగ్గింపు, నష్టాల నియంత్రణ వంటి కారణాలకు బదులు, ఇప్పుడు సంస్థ పునర్నిర్మాణం, పురోగతి, వర్క్‌ఫోర్స్ ఆప్టిమైజేషన్ వంటి పదాలను ఉపయోగిస్తూ ఉద్యోగులను తొలగిస్తున్నాయి. కమ్యూనికేషన్లు, పాడ్‌కాస్టింగ్, పరికరాలు, హెచ్ఆర్, సర్వీస్ డిపార్ట్‌మెంట్‌లలో కోతలు ఎక్కువగా ఉన్నాయి. వ్యయ నియంత్రణలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. భారత ఐటి రంగంలో సైలెంట్ లేఆఫ్‌లు ఉద్యోగుల్లో దడ పుట్టిస్తున్నాయి. ఎఐ సాంకేతికతతో ఇంజనీరింగ్ పనులను ఆటోమేట్ చేయడం, వ్యయ తగ్గింపు చర్యలు, వ్యాపార వృద్ధిలో మందగమనం వంటివి దీనికి కారణాలు. కంపెనీలు సామూహిక లేఆఫ్‌లను ప్రకటిస్తే మార్కెట్లో చెడు సంకేతం వెళ్తుందని భావించి, ఉద్యోగులే స్వచ్ఛందంగా రాజీనామా చేసేలా ఒత్తిడి చేసే పద్ధతులను అనుసరిస్తున్నాయి. ఎఐ వల్ల ఉద్యోగాలు పోతాయని 67.5 శాతంమంది ఇంజినీర్లలో ఆందోళన నెలకొన్నట్లు ఒక అధ్యయనంలో తేలింది. నైపుణ్యాల్ని పెంచుకోకపోతే కెరీర్‌కు రక్షణ ఉండదని 87.5 శాతం మంది అభిప్రాయపడ్డారు. వచ్చే పదేళ్లలో 40 శాతం వరకు జాబ్స్ ఎఐ పరిధిలోకి వెళ్లే అవకాశం ఉందని, దీంతో 89 శాతం మేర ఇంజినీర్లు ఎఐ, ఎంఎల్‌లోనే కొత్త నైపుణ్యాల్ని నేర్చుకోవాలనుకుంటున్నారని ఆ అధ్యయంలో పేర్కొంది. ఎఐ విప్లవంపై మరో వాదన కూడా ఉంది. ఎఐ అభివృద్ధి వల్ల ఉద్యోగాల స్వరూపం మారుతుందని ఒకవైపు చర్చ జరుగుతుంటే, అనేక సంస్థలు ఖర్చులను తగ్గించుకోవడానికి ఉద్యోగాలను తొలగిస్తూ, దానికి ఎఐ ని కారణంగా చూపుతున్నాయని విమర్శలు ఉన్నాయి. ఎఐ సాధనాలు ఇప్పటివరకు కొన్ని రంగాల్లో మాత్రమే ప్రభావవంతంగా ఉన్నాయని, వేలాది మంది ఉద్యోగాలను ఒకేసారి భర్తీ చేసే స్థాయికి ఇంకా చేరలేదని కొందరు నిపుణులు వాదిస్తున్నారు. ఈ పరిణామాల మధ్య ఎఐ సునామీని ఎదుర్కోవడానికి ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రపంచాన్ని కొత్త పుంతలు తొక్కిస్తోంది, భారతీయ ఉద్యోగ మార్కెట్ ఈ మార్పులకు అనుగుణంగా మారాల్సి ఉంటుంది.



# యాదగిరిగుట్టలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఫ్లెక్సీ వార్

(మొదటి పేజీ తరువాయి)

ఫ్లెక్సీలపై నిషేధం ఉన్నప్పటికీ ఏర్పాటు చేయడంపై మండిపడ్డారు. అక్కడున్న ఫ్లెక్సీలను చించేశారు.

వివరాల ప్రకారం.. కాంగ్రెస్ శ్రేణులు తాజాగా మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్ పర్యటన సందర్భంగా వైకుంఠ ద్వారం వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. మంత్రులకు స్వాగతం అంటూ ఫ్లెక్సీలను పెట్టారు. అయితే, ఫ్లెక్సీల ఏర్పాటు నిషేధం ఉన్నప్పటికీ ఎలా పెట్టారంటూ బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నించారు. అనంతరం, వైకుంఠ ద్వారం వద్ద బీఆర్ఎస్ నేతల బైఠాయించి నిరసనలు తెలిపారు. దీంతో, రంగంలోకి దిగిన పోలీసులు.. బీఆర్ఎస్ నాయకులను పీఎస్‌కు తరలించారు. కాగా, గతంలోనూ మంత్రుల పర్యటన సందర్భంగా ఇష్టారీతిన కాంగ్రెస్ కార్యకర్తల ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యేకు ఈవో మద్దతుగా ఉంటూ ఇలాంటి వాటిపై చర్యలు తీసుకోవడం లేదంటూ మండిపడ్డారు. ఇదిలా ఉండగా.. యాదగిరిగుట్ట వైకుంఠ ద్వారం, ఆలయం చుట్టూ ఫ్లెక్సీల ఏర్పాటుపై గతంలోనే నిషేధం విధించారు. అయినప్పటికీ ఈ నిషేధాన్ని కాంగ్రెస్ నేతలు ఉల్లంఘించారు. కాగా, కాంగ్రెస్ శ్రేణుల ఓవరాక్షన్‌తో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్టు బీఆర్ఎస్ శ్రేణులు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో హిందూ సంఘాలు సైతం నిరసనలకు, ధర్నాలకు సిబ్బమైనట్టు తెలిపారు.

## చమురు ట్యాంకర్‌ను వెంటాడుతున్న అమెరికా

వెనిజులా సమీపంలోని అంతర్జాతీయ జలాలలో అమెరికా దళాలు మరో చమురు ట్యాంకర్‌ను వెంటాడుతున్నాయి. ఈ విషయాన్ని అమెరికా అధికారి ఒకరు ధృవీకరించారు. నికొలస్ మదురో నేతృత్వంలోని వెనిజులా ప్రభుత్వంపై అమెరికా తీవ్రమైన ఒత్తిడి తెస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఇప్పటికే రెండు చమురు ట్యాంకర్లపై దాడి చేసి వాటిని స్వాధీనం చేసుకున్న అమెరికా దళాలు తాజాగా మరో ట్యాంకర్ వెంటపడ్డాయి. ఈ చమురు నౌక ఓ తప్పుడు పతాకంతో ప్రయాణిస్తోందని అమెరికా అధికారి ఆరోపించారు. దీనిని స్వాధీనం చేసుకోవాల్సిందిగా ఆదేశాలు ఉన్నాయని చెప్పారు. కాగా ఈ నౌక అమెరికా ఆంక్షలను ఎదుర్కొంటోందని రాయిటర్స్ వార్తా సంస్థ తెలిపింది. అయితే అందులో ఎవరూ లేరని చెప్పింది. చమురు నౌక ఎక్కడ ఉన్నది, దాని పేరు ఏమిటి అనే సమాచారాన్ని అమెరికా అధికారి తెలియజేయలేదు. అయితే దీని పేరు బెల్లా 1 అని, అది ముడి చమురును రవాణా చేసే పెద్ద నౌక అని, దానిపై అమెరికా ఆర్థిక శాఖ గత సంవత్సరమే ఆంక్షలు విధించిందని బ్రిటన్‌కు చెందిన మారీటైమ్ రిస్క్ మేనేజ్‌మెంట్ గ్రూప్ వాన్‌గార్డ్ తెలిపింది. ఈ నౌకకు ఇరాన్‌తో సంబంధం ఉన్నదని చెప్పింది. అమెరికా తీర గస్తీ దళం వెంటపడే సమయానికి నౌక ఖాళీగానే ఉన్నదని తెలుస్తోంది. ఈ నౌక 2021లో వెనిజులా చమురును చైనాకు రవాణా చేసింది. అంతకుముందు అది ఇరాన్ ముడి చమురును సరఫరా చేసింది.

## ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో మళ్లీ ట్రంప్ ఫొటో

లైంగిక నేరస్థుడు జెఫ్రీ ఎప్‌స్టీన్ దర్యాప్తు ఫైల్స్ నుంచి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఫొటో అదృశ్యమైన ఉదంతంపై తీవ్ర రాజకీయ దుమారం రేగడంతో న్యాయ శాఖ దిగివచ్చింది. ట్రంప్ ఫొటోతో కూడిన చిత్రాన్ని ఇరవై నాలుగు గంటల వ్యవధిలో తిరిగి చేర్చడం జరిగిందని అధికారులు ధృవీకరించారు. ఈ చిత్రం కారణంగా ఎప్‌స్టీన్ బాధితులను బయటపెట్టే ప్రమాదం ఏదీ లేదని నిర్ధారించుకున్నందున దానిని తిరిగి పోస్ట్ చేశామని న్యాయ శాఖ ఆదివారం తెలిపింది. ఇంతకీ ఆ ఫొటోలో ఒక బల్ల కన్పించింది. దాని సొరుగు తెరిచి ఉంది. అందులో పలువురు మహిళలతో ట్రంప్ ఉన్న ఫొటో ఉంది. ముందు జాగ్రత్తగా జరిపిన సమీక్షలో భాగంగా దానిని ఎప్‌స్టీన్ ఫైల్స్ నుంచి తొలగించారు. 'ఎప్‌స్టీన్ బాధితులెవ్వరూ ఆ ఫొటోలో లేరని నిర్ధారణ అయింది. అందుకే దానిలో ఎలాంటి మార్పు చేయకుండా తిరిగి పోస్ట్ చేశాం' అని న్యాయ శాఖ తెలిపింది. కాగా ఎప్‌స్టీన్ ఫైల్స్ నుంచి దేశాధ్యక్షుడి ఫొటోను తొలగించాలని తీసుకున్న నిర్ణయంతో ట్రంప్‌కు ఎలాంటి సంబంధం లేదని అమెరికా అటార్నీ జనరల్ టాడ్ బ్లాంచ్ అంతకుముందు చెప్పారు. ఫొటోలో కన్పించిన మహిళ గురించే ఆలోచించాము తప్ప ట్రంప్ గురించి కాదని వివరణ ఇచ్చారు. ఫొటోను తొలగించిన సమయంలో అధికారులకు పూర్తి సమాచారం అందలేదని, అందుకే దానిని తాత్కాలికంగా తీసేశారని చెప్పుకొచ్చారు.

## కాంగ్రెస్ విజయోత్సవ ర్యాలీలో విషాదం

- సర్పంచ్ కారు కిందపడి బాలిక మృతి
- ఆస్పత్రి వద్ద బంధువుల ఆందోళన

వికారాబాద్,డిసెంబర్23 (మొదటి పేజీ తరువాయి):



వికారాబాద్ జిల్లాలో కాంగ్రెస్ సర్పంచ్ విజయోత్సవ ర్యాలీలో విషాదం నెలకొంది. పోడూరు మండలం రాకంచర్ల గ్రామంలో కాంగ్రెస్ సర్పంచ్ కమ్లీబాయ్ నిర్వహించిన ర్యాలీలో ఏడేళ్ల చిన్నారిపై నుంచి కారు వెళ్లింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన బాలిక దుర్మరణం చెందింది. వివరాల్లోకి వెళ్తే.. సర్పంచ్‌ల ప్రమాణస్వీకరం సోమవారం నాడు పూర్తి కావడంతో రాకంచర్ల గ్రామంలో కాంగ్రెస్ సర్పంచ్ కమ్లీబాయ్ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పర్మిషన్ లేకున్నా డీజేతో ర్యాలీ ఏర్పాటు చేశారు. ఆ ర్యాలీని చూస్తున్న సమయంలోనే ఏడేళ్ల చిన్నారి కుర్వా సౌజన్యపై నుంచి సర్పంచ్ కారు వెళ్లింది. కారు చక్రాల కింద నలిగి తీవ్ర గాయాలు కావడంతో బాలికను హుటాహుటిన పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కానీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చిన్నారి ప్రాణాలు కోల్పోయింది. బాలిక మృతితో గ్రామంలో తీవ్ర ఉద్రిక్త నెలకొంది. ర్యాలీలో సర్పంచ్ కారు కింద పడటంతోనే తన కూతురు మరణించిందని బాలిక తండ్రి, గ్రామస్తులు ఆరోపించారు. కానీ బాలిక కారు కింద పడలేదని సర్పంచ్ భర్త పెంటయ్య వాదించారు. దీంతో ఆస్పత్రి ముందు బాధిత కుటుంబసభ్యులు, కాంగ్రెస్ కార్యకర్తలకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో అక్కడకు వచ్చిన పోలీసులు ఇరువర్గాలను సముదాయించి పంపించేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# మాస్కోలో కారు బాంబు దాడి.. రష్యాకు కీలక జనరల్ మృతి



మాస్కోలో జరిగిన కారు బాంబు దాడిలో కీలక రష్యా సైనిక జనరల్ ఒకరు మృతి చెందారు. ఈ విషయాన్ని రష్యా దర్యాప్తు సంస్థ వెల్లడించింది. రష్యా సాయుధ దళాల జనరల్ స్టాఫ్‌కు చెందిన ఆపరేషనల్ ట్రైనింగ్ డైరెక్టర్ అధిపతి లెఫ్టినెంట్ జనరల్ ఫనిల్ సర్వరోవ్, బాంబు దాడి ఘటనలో తీవ్ర గాయాలు కావడంతో మరణించినట్లు ఆ సంస్థ తెలిపింది.ఆయన కారు కింద అమర్చిన పరికరం పేలడంతో ఈ ఘటన చోటు చేసుకుంది. అపార్టుమెంట్ దగ్గర కారు పార్కింగ్ ప్రాంతంలో జరిగిన ఈ దాడి వెనుక ఉక్రెయిన్ ఇంటెలిజెన్స్ హస్తం ఉన్నట్లు రష్యా అధికారులు అనుమానిస్తున్నారు. ఆ దిశగా అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. గత మూడేళ్లుగా రష్యా, ఉక్రెయిన్ దేశాల మధ్య యుద్ధం కొనసాగుతోంది. ఈ యుద్ధాన్ని ఆపేందుకు వివిధ దేశాలు ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ ఉద్రిక్తతలు మాత్రం తగ్గడం లేదు. ఇటీవల కాస్పియన్ సముద్రంలోని రష్యా కీలక చమురు క్షేత్రంపై ఉక్రెయిన్ డ్రోన్ దాడులు నిర్వహించింది. ముున్ముందు మరిన్ని దాడులు చేస్తామని కూడా హెచ్చరించింది.

# భారత్‌తో యుద్ధంలో దేవుడు నుంచి పాక్‌కు సాయం అందింది



ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్‌తో జరిగిన సైనిక ఘర్షణ గురించి పాకిస్థాన్ త్రివిధ దళాల అధిపతి, ఫీల్డ్ మార్షల్ అసీమ్ మునీర్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు.భారత్‌తో జరిగిన సైనిక ఘర్షణలో తమకు దేవుడు నుంచి సహాయం అందిందని వ్యాఖ్యానించారు. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా మే 7న భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టి పాకిస్థాన్ , పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై దాడి అనంతరం ఇరు దేశాల మధ్య ఘర్షణ జరిగింది. నాలుగు రోజుల పాటు కొనసాగిన ఉద్రిక్తతలు చివరకు కాల్పుల విరమణ ఒప్పందంతో తగ్గుముఖం పట్టిన సంగతి తెలిసిందే. ఇస్లామాబాద్‌లో నాలుగు రోజుల పాటు జరిగే నేషనల్ ఉలేమా కాన్ఫరెన్స్ ప్రారంభోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న జనరల్ అసీమ్ మునీర్ .. అఫ్గనిస్థాన్‌లోని తాలిబన్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్ లేదా తెహ్రీక్‌ఇతాలిబన్ పాకిస్థాన్‌లలో ఎవరినో ఒకరిని ఎంచుకోవాలని తాలిబన్లను హెచ్చరించారు. దేశంలోకి చొరబడుతోన్న ఉగ్రవాదులలో ఎక్కువ మంది అఫ్గన్ జాతీయులేనని ఆయన ఆరోపించారు. ఈ సమావేశంలో మునీర్ ఖురాన్‌లోని కొన్ని వాక్యాలను పఠిస్తూ.. భారత్‌తో జరిగిన సైనిక సంఘర్షణ గురించి ప్రస్తావించారు. పాకిస్థాన్ సైన్యం భారత్‌తో పోరాడుతున్నప్పుడు 'దేవుడి సాయం' పొందిందని పాక్ డిఫెన్స్ స్టాఫ్ చీఫ్ మునీర్ అన్నారు. 'మేము దానిని అనుభవించాం' అని మునీర్ వ్యాఖ్యానించారు. పాకిస్థాన్ ఏర్పాటును 1,400 సంవత్సరాల కిందట అరబ్ ప్రాంతంలో (నేటి సౌదీ అరేబియా) ప్రవక్త స్థాపించిన రాజ్యంతో మునీర్ పోల్చడం గమనార్హం. ప్రపంచంలో 57 ఇస్లామిక్ దేశాలు ఉన్నాయని, వాటిలో 'హరమైన్ షరీఫైన్' (మక్కా, మదీనా) సంరక్షకులుగా ఉండటం దేవుడు మాకు ఇచ్చిన గౌరవం' అని పాక్ త్రివిధ దళాధిపతి పేర్కొన్నారు. టీటీపీ లోకి వస్తున్న వారిలో 70 శాతం మంది అఫ్గన్ జాతీయులేనని ఆయన ఆరోపించారు.

# అందుకే దేశం వీడి వచ్చా షేక్ హసీనా సంచలన కామెంట్లు



బంగ్లాదేశ్‌లో ప్రస్తుత పరిస్థితులు అత్యంత దారుణంగా ఉన్నాయని.. దేశంలో హింస సర్వసాధారణ విషయంగా మారిపోయిందని ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా మండిపడ్డారు. మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని మధ్యంతర ప్రభుత్వం.. దేశంలో శాంతిభద్రతలను కాపాడటంలో పూర్తిగా విఫలమైందని, అల్లర్లను అదుపు చేయలేని నిస్సహాయ స్థితిలో ఉందని ఆమె ధ్వజమెత్తారు. ముఖ్యంగా ఆమె ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ప్రత్యేక ఈ మెయిల్ ఇంటర్వ్యూలో.. ఆమె బంగ్లాదేశ్ ప్రస్తుత స్థితిగతులపై విస్తుపోయే విషయాలను వెల్లడించారు. అలాగే తాను దేశం ఎందుకు వీడారో కూడా క్లారిటీగా చెప్పేశారు. జులైలో జరిగిన ఆందోళనల్లో కీలక పాత్ర పోషించిన రాజకీయ కార్యకర్త షరీఫ్ ఉస్మాన్ హాదీ హత్య దేశంలో కొత్త హింసాకాండకు తెరలేపిందని హసీనా పేర్కొన్నారు. ''ఈ దారుణ హత్య యూనస్ పాలనలో పెచ్చుమీరిన అరాచకత్వానికి నిదర్శనం. దేశం అంతర్గతంగా అస్థిరతకు గురవడమే కాకుండా.. పొరుగు దేశాలతో ఉన్న సంబంధాలు కూడా దెబ్బతింటున్నాయి. మైనారిటీలపై దాడులు, అరాచకాలు చూస్తుంటే అంతర్జాతీయ వేదికపై బంగ్లాదేశ్ విశ్వసనీయత కోల్పోతోంది'' అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. యూనస్ ప్రభుత్వం తీవ్రవాదులకు మద్దతు ఇస్తోందని హసీనా తీవ్ర ఆరోపణలు చేశారు. జైల్లో ఉన్న కరుడుగట్టిన ఉగ్రవాదులను విడుదల చేయడం, రాడికల్ సంస్థ జమాతే ఇస్లామీపై నిషేధం ఎత్తివేయడం వంటి నిర్ణయాలు దేశ సెక్యులర్ మూలాలను దెబ్బతీస్తున్నాయని ఆమె విమర్శించారు. ''యూనస్ రాజకీయ నాయకుడు కాదు, దేశాన్ని పాలించే అనుభవం ఆయనకు లేదు. తీవ్రవాదులు ఆయనను ఒక ముసుగులా వాడుకుంటున్నారు. క్యాబినెట్‌లో సైతం తీవ్రవాద భావజాలం ఉన్నవారికి చోటు కల్పించడం దక్షిణ ఆసియా సుస్థిరతకే ప్రమాదం'' అని హెచ్చరించారు.



# సోనియా, రాహుల్‌కు ఢిల్లీ హైకోర్టు నోటీసులు

నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు ఢిల్లీ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో మనీలాండరింగ్ కేసుకు అనుమతి ఇవ్వాలంటూ ఈడీ చేసుకున్న అప్పీల్ పై సమాధానం ఇవ్వాలని సోనియా, రాహుల్ గాంధీని ఆదేశించింది. తదుపరి విచారణను జనవరికి వాయిదా వేసింది. కాగా నేషనల్ హెరాల్డ్ మనీలాండరింగ్ కేసులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీలతో పాటు ఇతరులపై ఈడీ దాఖలు చేసిన ఛార్జిషీట్ ను ఇటీవల రౌస్ అవెన్యూ కోర్టు కొట్టివేసింది. ప్రైవేటు వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పీఎంఎల్ఏ కింద చర్యలు తీసుకోవడం సాధ్యం కాదని కోర్టు అభిప్రాయపడింది. అదేవిధంగా కేసులో వేసిన ఛార్జ్‌షీటు కూడా చట్టపరంగా నిలవదని డిసెంబర్ 16న న్యాయమూర్తి ఆ పిటిషన్‌ను డిస్మిస్ చేశారు. ఈ క్రమంలోనే ఇవాళ ట్రయల్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ ఈడీ అధికారులు ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. సోనియా, రాహుల్ గాంధీపై మనీలాండరింగ్ కేసుకు అనుమతి ఇవ్వాలని హైకోర్టుకు అప్పీల్ చేసింది. ఈ అప్పీల్‌పై సమాధానం ఇవ్వాలని ఢిల్లీ హైకోర్టు సోనియా,రాహుల్ కు నోటీసులు ఇచ్చింది.

# బీజేపీ భారత రాజ్యాంగాన్ని అంతం చేయాలని చూస్తోంది

జర్మనీ పర్యటనలో ఉన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. బెర్లిన్‌లోని హెర్టీ స్కూల్‌లో జరిగిన ముఖాముఖిలో ఆయన మాట్లాడుతూ.. దేశంలోని అన్ని వర్గాలకు సమాన హక్కులు కల్పించే భారత రాజ్యాంగాన్ని అంతం చేసేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని సంచలన ఆరోపణలు చేశారు. భారతదేశం వంటి అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం ప్రపంచానికే ఒక గొప్ప ఆస్తి అని, అయితే ప్రస్తుతం దేశంలోని రాజ్యాంగ వ్యవస్థలను బీజేపీ తన గుప్పిట్లోకి పెట్టుకుని రాజకీయ స్వార్థానికి వాడుకుంటోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం దేశంలోని వ్యవస్థలనే కాకుండా, ''ఒక వ్యక్తి ఒక ఓటు'' అనే ప్రాథమిక సూత్రాన్ని కూడా దెబ్బతీసేలా బీజేపీ అడుగులు వేస్తోందని, దీనిని అడ్డుకోవడమే విపక్షాల ప్రధాన లక్ష్యమని రాహుల్ స్పష్టం చేశారు. తయారీ రంగంలో భారత్ వెనుకబడటం వల్ల నిరుద్యోగం పెరుగుతోందని, ప్రస్తుతం భారత్‌లో ప్రజాస్వామ్యంపై జరుగుతున్న ఈ దాడులు అంతర్జాతీయ ప్రజాస్వామ్య వ్యవస్థలకే ప్రమాదకరమని ఆయన ఈ సందర్భంగా రాహుల్ గాంధీ హెచ్చరించారు. కాగా మరోసారి విదేశాల వేదికగా రాహుల్ గాంధీ.. భారత్ ను తక్కువ చేసి మాట్లాడటంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.



# తమిళనాడులో పొలిటికల్ హీట్..



- విజయ్ రాజకీయాలపై శరత్ కుమార్ కీలక వ్యాఖ్యలు!

అసెంబ్లీ ఎన్నికల దగ్గర పడుతుండడంతో తమిళనాడు రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. నటుడు, బీజేపీ నేత శరత్ కుమార్ అధికార డీఎంకే ప్రభుత్వంపై సంచలన వ్యాఖ్యలు చేస్తూ రాజకీయ ప్రకంపనలు సృష్టించారు. మదురై తిరుప్పరంకుండ్రం కొండపై దీపం వెలిగించే అంశంలో జరుగుతున్న వివాదం పై ఆయన స్పందిస్తూ, రాష్ట్రంలో హిందువుల పరిస్థితిపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ''ప్రస్తుతం తమిళనాడులో హిందువులు తాము హిందువులమని చెప్పుకోవడానికి కూడా భయపడే పరిస్థితి నెలకొంది. హిందువులు 'హిందూ' అనే పదాన్నే మర్చిపోతున్నారు. మతపరమైన ఆచారాలను పాటించడంలో కూడా వివక్ష ఎదురవుతోంది'' అని శరత్ కుమార్ మండిపడ్డారు. మదురై దీపం వివాదం విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును ఆయన తప్పుబట్టారు. అలాగే రాబోయే 2026 అసెంబ్లీ ఎన్నికలపై శరత్ కుమార్ తన ప్రణాళికను స్పష్టం చేశారు. ''2026 ఎన్నికల్లో తాను స్వయంగా పోటీ చేయనని, క్షేత్రస్థాయిలో ఉండి బీజేపీ కూటమి గెలుపు కోసం ప్రచారం చేస్తానని స్పష్టం చేశారు. డీఎంకే ప్రభుత్వాన్ని గద్దె దించడమే తన ప్రధాన లక్ష్యం'' అని ప్రకటించారు. ఇదే సమయంలో కొత్తగా రాజకీయాల్లోకి వచ్చిన నటుడు విజయ్ గురించి మాట్లాడుతూ.. ''నేను విజయ్‌ను ఒక రాజకీయ నాయకుడిగా చూడటం లేదు. రాజకీయాల్లో ఎవరికి ఏ బాధ్యతలు ఇవ్వాలి, ఎవరు మంచివారో, ఎవరు చెడ్డవారో కూడా ఆయనకు ఇంకా తెలియదు'' అని వ్యాఖ్యానించారు. శరత్ కుమార్ చేసిన ఈ వ్యాఖ్యలు అటు డీఎంకే వర్గాల్లో, ఇటు విజయ్ అభిమానుల్లో చర్చనీయాంశంగా మారాయి. 2026 ఎన్నికలకు ముందే తమిళనాడులో సమీకరణాలు వేగంగా మారుతున్నాయని ఈ పరిణామాలు సూచిస్తున్నాయి.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## పని గంటల కంటే నాణ్యత ముఖ్యం ఇన్ఫోసిస్ సహవ్యవస్థాపకుడు శిబులాల్

గత కొంతకాలంగా ఉద్యోగుల పని గంటల గురించి సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ముఖ్యంగా దేశీయ ఐటీ సేవల దిగ్గజం ఇన్ఫోసిస్ సహవ్యవస్థాపకుడు ఎన్ ఆర్ నారాయణ మూర్తి వారంలో 70 గంటలు పని చేయాలని సూచించారు.ఈ నేపథ్యంలో ఇన్ఫోసిస్ సహవ్యవస్థాపకుడు ఎస్ డీ శిబులాల్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఐఐఎంయూఎన్ నిర్వహించిన ఓ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన.. వారంలో ఎక్కువ గంటలు పనిచేయడం కంటే, చేసే పనిపై ఎక్కువ దృష్టి ఉండాలని అభిప్రాయపడ్డారు. వారానికి 70 గంటల పని మూర్తి వ్యాఖ్యలపై స్పందించిన శిబులాల్.. నా దృష్టిలో సమయం కంటే, నాణ్యత ముఖ్యం. చేస్తున్న పని విషయంలో లీనమై ఉండాలి. దృష్టి మరల్చకూడదు. పని చేస్తున్నప్పుడు సెల్‌ఫోన్, ఇతర ఆలోచనలపై దృష్టి వెళ్లకూడదు. ఒక వ్యక్తి ఏ పని ఎంచుకున్నా, 100 శాతం అందులో లీనమై ఉండాలని, పూర్తి అంకితభావంతో పనిచేయాలని ఆయన సూచించారు. అంతిమంగా వ్యక్తిగత నిర్ణయాలు, సమయపాలన వంటి వివిధ అంశాలకు మనమిచ్చే ప్రాధాన్యతలకు సంబంధించినవని అన్నారు. వ్యక్తిగత, వృత్తిపరమైన, ప్రజా జీవితం అనేవి ఉంటాయి, ఈ మూడింటి మధ్య సమయాన్ని విభజించడమే ఒక వ్యక్తి చేయాల్సిన బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.



## ఫ్లాట్‌గా ప్రారంభమైన సూచీలు

దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం ట్రేడింగ్‌ను స్వల్ప నష్టాలతో, దాదాపు ఫ్లాట్‌గా ప్రారంభించాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వస్తున్న మిశ్రమ సంకేతాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరిస్తుండటంతో సూచీలు పెద్దగా కదలికలు లేకుండా కనిపిస్తున్నాయి. ప్రారంభ సెషన్‌లో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ సుమారు 88 పాయింట్లు కోల్పోగా, జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 23 పాయింట్ల స్వల్ప నష్టంతో కొనసాగుతోంది. సెన్సెక్స్ 30 ప్యాక్‌లోని కంపెనీల పనితీరును గమనిస్తే, కొన్ని భారీ సంస్థలు లాభాల బాటలో పయనిస్తూ మార్కెట్‌కు మద్దతు ఇస్తున్నాయి. ముఖ్యంగా బజాజ్ ఫైనాన్స్, పవర్‌గ్రిడ్, టాటా స్టీల్ వంటి షేర్లు కొనుగోళ్ల మద్దతుతో రాణిస్తున్నాయి. వీటితో పాటు లార్సెన్ అండ్ టూబ్రో, టైటన్ కంపెనీ షేర్లు కూడా సానుకూల ధోరణిని ప్రదర్శిస్తూ ఇన్వెస్టర్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. రంగాల వారీగా చూస్తే మెటల్, పవర్ రంగాలు కొంత మెరుగ్గా పనిచేస్తున్నాయి. మరోవైపు, ఐటీ రంగ షేర్లలో అమ్మకాల ఒత్తిడి స్పష్టంగా కనిపిస్తోంది, ఇది మార్కెట్ సూచీలను కిందికి లాగుతోంది. ప్రముఖ ఐటీ దిగ్గజాలైన ఇన్ఫోసిస్, టీసీఎస్, టెక్ మహీంద్రా వంటి సంస్థలు నష్టాల్లో ట్రేడవుతుండటం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తోంది. వీటితో పాటు ఏషియన్ పెయింట్స్ షేర్లు కూడా నష్టాల బాట పట్టడంతో, ఐటీ మరియు కన్స్యూమర్ గూడ్స్ రంగాల్లో బలహీనత కనిపిస్తోంది. గ్లోబల్ ఐటీ ఖర్చులపై నెలకొన్న అనిశ్చితి ఈ ప్రభావానికి కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుత మార్కెట్ పరిస్థితులను విశ్లేషిస్తే, ఇన్వెస్టర్లు పెద్దగా రిస్క్ తీసుకోవడానికి ఇష్టపడటం లేదని అర్థమవుతోంది. ద్రవ్యోల్బణం, అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ పరిణామాలు మార్కెట్ గమనాన్ని నిర్దేశిస్తున్నాయి. రానున్న గంటల్లో మరిన్ని కంపెనీల త్రైమాసిక ఫలితాలు మరియు విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల సరళిని బట్టి మార్కెట్ ఏదో ఒక దిశలో పయనించే అవకాశం ఉంది. ప్రస్తుతానికి మార్కెట్ స్వల్ప శ్రేణిలోనే కదలాడుతూ స్థిరపడేందుకు ప్రయత్నిస్తోంది.

## ఏటా కొత్త పిక్సెల్ ఫోన్.. కొత్త అప్‌గ్రేడ్ ప్రోగ్రామ్ తీసుకొచ్చిన గూగుల్

పిక్సెల్ ఫోన్ లవర్స్‌కి గుడ్‌న్యూస్. ప్రముఖ టెక్ సంస్థ గూగుల్ (Google).. పిక్సెల్ అప్‌గ్రేడ్ ప్రోగ్రామ్‌ను భారత్‌కు తీసుకొచ్చింది. దీనిద్వారా ఏటా కొత్త పిక్సెల్ ఫోన్‌కు మారొచ్చు. లేటెస్ట్ గూగుల్ పిక్సెల్ స్మార్ట్‌ఫోన్ కొనుగోలును ఈ అప్‌గ్రేడ్ ప్రోగ్రామ్ సులభతరం చేస్తుందని కంపెనీ తెలిపింది. మెరుగైన ఫైనాన్సింగ్ సౌకర్యం కూడా కల్పిస్తున్నట్లు పేర్కొంది.

ఈ అప్‌గ్రేడ్ ప్రోగ్రామ్‌లో పాల్గొనాలంటే పిక్సెల్ స్మార్ట్‌ఫోన్‌ను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. 24 నెలల నోకాస్ట్ ఈఎంఐ ప్లాన్‌ను ఎంచుకోవచ్చు. నెలకు రూ.3,333 నుంచి ఈ ప్లాన్లు ప్రారంభమవుతాయి. ఈ పిక్సెల్ ఫోన్‌కు చెల్లింపులు చేసుకుంటూ వెళ్లాక 9వ నెల నుంచి 15వ నెల మధ్య కొత్త ఫోన్ అప్‌గ్రేడ్‌కు అర్హత లభిస్తుంది. వద్దనుకుంటే 24 నెలల ఈఎంఐ చెల్లింపులను పూర్తి చేసి ఫోన్ సొంతం చేసుకోవచ్చు. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం నాలుగు దశలు ఉంటాయి. తొలుత పిక్సెల్ 10 సిరీస్‌లో ఒక డివైజ్‌ను నోకాస్ట్ ఈఎంఐ కింద కొనుగోలు చేయాలి. 915 నెలల మధ్య కొత్త ఫోన్‌కు అప్‌గ్రేడ్ అవడానికి అర్హత లభిస్తుంది. అప్పుడు గూగుల్ భాగస్వామి అయిన క్యాషిఫైకి.. మీ పాత ఫోన్‌ను విక్రయించాలి. మీ పాత ఫోన్‌కు విలువ కట్టి ఆ మొత్తాన్ని బ్యాంకు ఖాతాలో జమ చేస్తుంది. ఆ మొత్తంతో మీ పాత ఫోన్ బకాయిని క్లియర్ చేయొచ్చు. ఈ ప్రోగ్రామ్ కింద ఎన్‌రోల్ చేసుకున్న వారికి ఎక్స్ఛేంజ్ బోనస్ కింద రూ. 7వేలు లభిస్తుందని, దీంతో పాటు అష్యూర్డ్ బై బ్యాంక్ గ్యారెంటీ కూడా లభిస్తుందని తెలిపింది. బజాజ్ ఫైనాన్స్, క్యాషిఫై, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ భాగస్వామ్యంతో ఈ అప్‌గ్రేడ్ ప్రోగ్రామ్‌ను గూగుల్ అందిస్తోంది. 2026 జూన్ 30 వరకు అప్‌గ్రేడ్ ప్రోగ్రామ్ అందుబాటులో ఉంటుందని కంపెనీ తెలిపింది.

# ఆకాశమే హద్దుగా పసిడి పరుగులు

బులియన్ మార్కెట్‌లో బంగారం ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. సామాన్యులకు అందనంత ఎత్తుకు చేరుతూ పసిడి ధరలు సరికొత్త రికార్డులను సృష్టిస్తున్నాయి.కేవలం ఒక్క రోజులోనే 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర ఏకంగా రూ.2,400 పెరిగి రూ.1,38,550కి చేరడం ఇన్వెస్టర్లను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. గత కొద్ది రోజులుగా మార్కెట్‌లో నెలకొన్న అనిశ్చితి, అంతర్జాతీయ పరిణామాల కారణంగానే ధరలు ఈ స్థాయిలో పెరుగుతున్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు.గత రెండు రోజుల్లోనే బంగారం ధర దాదాపు రూ.4,370 మేర పెరగడం గమనార్హం. ఈ భారీ పెరుగుదల కొనుగోలుదారులకు కోలుకోలేని షాక్ ఇస్తోంది. 22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర కూడా దీనికి ఏమాత్రం తీసిపోకుండా పరుగులు



పెడుతోంది. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధరపై రూ.2,200 ఎగబాకి ప్రస్తుతం రూ.1,27,000 వద్ద కొనసాగుతోంది. శుభకార్యాల సీజన్ నడుస్తున్న తరుణంలో ఈ ధరల పెరుగుదల మధ్యతరగతి ప్రజలకు పెను భారంగా మారుతోంది. కేవలం బంగారం మాత్రమే కాకుండా, వెండి ధరలు కూడా భారీగానే పెరిగాయి. కిలో వెండి ధరపై ఏకంగా రూ.3,000 పెరగడంతో మార్కెట్‌లో వెండి ధర రూ.2,34,000 మార్కును తాకింది. పారిశ్రామిక అవసరాలు మరియు వెండిపై పెరుగుతున్న పెట్టుబడుల కారణంగానే ఈ స్థాయిలో రేట్లు పెరుగుతున్నట్లు తెలుస్తోంది. వెండి నగలు లేదా వస్తువులు కొనాలనుకునే వారు ఇప్పుడు భారీగా జేబులు ఖాళీ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని దాదాపు అన్ని ప్రధాన నగరాల్లోనూ ఇవే ధరలు కొనసాగుతున్నాయి. హైదరాబాద్‌తో పాటు విజయవాడ, విశాఖపట్నంలలో కూడా బంగారం, వెండి ధరల్లో పెద్దగా మార్పులు లేకుండా ఒకే రీతిన ట్రేడ్ అవుతున్నాయి. రానున్న రోజుల్లో అంతర్జాతీయ మార్కెట్ ఒడిదుడుకులను బట్టి ఈ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందనే వార్తలు వినియోగదారులను మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి.

# కీలక రంగాల ఉత్పత్తి పడక

భారత పారిశ్రామికోత్పత్తి రంగంలో అత్యంత కీలకమైన ఎనిమిది ప్రాధాన్యత రంగాలు పడకేశాయి. ఈ ఏడాది నవంబర్‌లో ఈ మౌలిక వసతుల రంగాల ఉత్పత్తి ఏకంగా 1.8 శాతానికి మందగించినట్లు సోమవారం కేంద్ర ప్రభుత్వ గణంకాలు వెల్లడించాయి. సిమెంట్, ముడి చమురు, సహజ వాయువు, ఎరువులు, విద్యుత్, బొగ్గు, స్టీల్, రిఫైనరీ తదితర ప్రధాన రంగాలు గతేడాది ఇదే నెలలో 5.8 శాతం వృద్ధిని కనబర్చగా.. గడిచిన నెలలో ఏకంగా 1.8 శాతానికి పడిపోవడం ఆర్థిక వ్యవస్థలోని మందగమనాన్ని సూచిస్తోంది. మొత్తం పారిశ్రామిక ఉత్పత్తి సూచీలో వీటి వాటా 40.27 శాతంగా ఉంది. వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. 2025 నవంబర్‌లో బొగ్గు ఉత్పత్తి పెరుగుదల 2.1 శాతానికి పరిమితమయ్యింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి నవంబర్ కాలంలో ఇది 1.4 శాతం వృద్ధితో సరిపెట్టుకుంది. గడిచిన నెలలో



చమురు ఉత్పత్తి 3.2 శాతానికి పడిపోయింది. సహజ వాయువు ఉత్పత్తి 2.5 శాతానికి, పెట్రోలియం రిఫైనరీ 0.9 శాతానికి పరిమితమయ్యాయి. ఎరువులు 5.6 శాతం, స్టీల్ 6.1 శాతం, సిమెంట్ 14.5 శాతం చొప్పున వృద్ధిని నమోదు చేశాయి. విద్యుత్ రంగం ఉత్పత్తి 2.2 శాతానికి పడిపోయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి నవంబర్ కాలంలో ఎనిమిది ప్రాధాన్యత రంగాల ఉత్పత్తి 2.4 శాతానికి క్షీణించింది. గతేడాది ఇదే కాలంలో 4.4 శాతం వృద్ధి నమోదయ్యింది. దీంతో పోల్చితే ప్రాధాన్యత రంగాల ఉత్పత్తి సగానికి కుంచించింది. మందగమనం వల్ల అధిక ధరలు, నిరుద్యోగం, ప్రజల ఆదాయాలు తగ్గడం తదితర పరిణామాలు వస్తు డిమాండ్‌ను దెబ్బతీస్తున్నాయి. దీంతో కొనుగోళ్లు తగ్గుతున్నాయి. ఈ ప్రభావం కీలక మౌలిక వసతుల రంగాల ఉత్పత్తిపై ప్రభావం చూపుతుతున్నాయని తెలుస్తోంది. పరిస్థితులు ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో పరిశ్రమలు, ఉపాధి మరింత దెబ్బతినే అవకాశాలున్నాయి. మరోవైపు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ త్రైమాసికంలో జీవృద్ధి రేటు 7.8 శాతంగా, సెప్టెంబర్ త్రైమాసికంలో ఏకంగా 8.2 శాతం పెరుగుదల చోటు చేసుకుంది. సాధారణంగా దేశ జీడీపీలో పారిశ్రామిక ఉత్పత్తి సూచీ వాటా 27 శాతంగా ఉంది. పారిశ్రామిక ఉత్పత్తి ప్రభావం మిగితా రంగాలపై ప్రత్యక్షంగా కనబడుతుంది. అలాంటి పారిశ్రామికోత్పత్తి పేలవమైన ప్రదర్శన కనబర్చినప్పటికీ జీడీపీ పరుగులు పెడుతోన్నట్టు మోడీ సర్కార్ గణంకాలను ప్రకటించడం అనేక అనుమానాలకు తావిస్తోందని నిపుణులు విశ్లేషిస్తోన్నారు.

# న్యూజిలాండ్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

అమెరికాతో ఆలస్యమవుతున్నా, పలు దేశాలతో వరుసపెట్టి వాణిజ్య ఒప్పందాలను మనదేశం కుదుర్చుకుంటోంది. జులైలో బ్రిటన్, ఈ నెల మొదట్లో ఒమన్‌తో సంతకాలు చేయగా, తాజాగా న్యూజిలాండ్‌తో ఒప్పంద సంప్రదింపులను మనదేశం పూర్తి చేసింది. భారత, న్యూజిలాండ్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి (ఎఫ్‌టీఏ) సంబంధించిన సంప్రదింపులు కొలిక్కి వచ్చాయని భారత ప్రధాని నరేంద్ర మోదీ, న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్ సోమవారం ప్రకటించారు. 2026 ప్రథమార్థంలో సంతకాలు జరగనున్న ఈ ఎఫ్‌టీఏ కింద వచ్చే 15 ఏళ్లలో భారత్‌లో 20 బి. డాలర్ల (సుమారు రూ.1.8 లక్షల కోట్ల) పెట్టుబడులను న్యూజిలాండ్ పెట్టనుంది. ఇరుదేశాల మధ్య వస్తు, సేవల ద్వైపాక్షిక వాణిజ్యం 2024లో 2.4 బిలియన్ డాలర్ల (సుమారు రూ.21,600 కోట్ల) మేర జరిగింది. ఇందులో వస్తువుల



వాటా 1.3 బి.డా. (సుమారు రూ.11,700 కోట్లు). ఎఫ్‌టీఏ కుదిరాక, అయిదేళ్లలో ద్వైపాక్షిక వాణిజ్యం రెట్టింపై 5 బిలియన్ డాలర్ల (సుమారు రూ.45,000 కోట్ల)కు చేరే అవకాశం ఉంది. ఉన్ని, బొగ్గు, కలప, వైన్, అవకాడో, బ్లూబెర్రీ వంటి 95% వస్తువులపై మనదేశం టారిఫ్‌ల రద్దు/తగ్గింపు చేస్తుంది. అయితే మన రైతులు, పరిశ్రమ ప్రయోజనాలను కాపాడడానికి డెయిరీ ఉత్పత్తులు, చక్కెర, సుగంధ ద్రవ్యాలు, నూనెలు, రబ్బరు దిగుమతులపై మాత్రం ఎటువంటి మినహాయింపులూ ఇవ్వలేదు.

# వడ్డీ రేటు 7.15 శాతానికి తగ్గిస్తూ ఎల్ఐసీహెచ్‌ఎఫ్ఎల్ నిర్ణయం

ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ గృహ రుణ గ్రహీతలకు శుభవార్తను అందించింది. గృహ రుణాలపై వడ్డీ రేట్లను 7.15 శాతానికి తగ్గిస్తున్నట్లు ప్రకటించింది. ఇటీవల ఆర్బీఐ ద్రవ్య పరపతి విధాన కమిటీ రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎల్ఐసీహెచ్‌ఎఫ్ఎల్ ఈ ప్రయోజనాన్ని వినియోగదారులకు అందిస్తోంది. ఈ తగ్గింపు నిర్ణయం నేటి నుంచి అమలులోకి వస్తుందని సంస్థ తెలిపింది.ఈ మేరకు



ఎల్ఐసీహెచ్‌ఎఫ్ఎల్ ఎండీ అండ్ సీఈవో త్రిభువన్ అధికారి మాట్లాడుతూ, ఈ సంవత్సరం ఆర్బీఐ 125 బేసిస్ పాయింట్ల రెపో రేటును తగ్గించిందని తెలిపారు. ఇది గృహ రుణాలు తీసుకునే వారికి కొంత భారం తగ్గిస్తుందని ఆయన అన్నారు. 2026లోకి అడుగుపెట్టనున్న ఈ సమయంలో వడ్డీ రేట్ల తగ్గింపు గృహ రుణాల డిమాండ్‌కు ఊతమిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.ఆర్బీఐ ఇటీవల రెపో రేటు తగ్గించిన తరువాత పలు బ్యాంకులు ఇప్పటికే వడ్డీ రేట్లను తగ్గిస్తూ నిర్ణయాలు తీసుకున్నాయి. ఈ క్రమంలో ఎల్ఐసీహెచ్‌ఎఫ్ఎల్ కూడా రుణ గ్రహీతలకు ఊరట కలిగిస్తూ నిర్ణయం తీసుకుంది. సొంతింటి కలను నెరవేర్చుకునేందుకు ఈ నిర్ణయం తోడ్పడుతుందని ఎల్ఐసీహెచ్‌ఎఫ్ఎల్ ఒక ప్రకటనలో పేర్కొంది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in